

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు డీఎస్సీ నిర్వహించి 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసింది. ఉద్యోగాలను అడ్డుకునేందుకు 350 పిటిషన్లు వేసినా అభ్యర్థులు పట్టుదలతో విజయం సాధించారు. ఏడాది తర్వాత వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


గురువారం 20.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 120 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# గ్రూప్-1లో అంతా 'తేడా'!

- ఎలక్ట్రీషియన్లు.. డ్రైవర్లు.. ప్లంబర్లతో జవాబు పత్రాల మూల్యాంకనం
- 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో పేపర్లు.. ప్రైవేటు ల్యాప్‌టాప్‌లు, వాట్సప్, గూగుల్ డ్రైవ్‌లకు వివరాలు
- 734 ఓఎంఆర్‌లలో 718లో మార్పులు.. 49 వేల డూప్లికేట్ స్లిప్పులు
- భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు తావులేకుండా ఏపీపీఎస్సీ ప్రక్షాళన: చంద్రబాబు


**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో ఊహకు కూడా అందని స్థాయిలో అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. గత పాలకులు బరితెగించి అక్రమాలకు పాల్పడ్డారని.. రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించాల్సిన గ్రూప్ 1 సర్వీసు అభ్యర్థుల నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని శాసనసభకు తెలియచేశారు. 344 నిబంధన కింద శాసనసభలో చేపట్టిన ప్రత్యేక చర్చలో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం ఏర్పడిన ఏపీపీఎస్సీ రాష్ట్రానికి కీలకమైన అధికారులను ఎంపిక చేసే సంస్థ అని..దాని విశ్వసనీయతను దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో సీఎం సీట్లో కూర్చుని నేరాలు చేసిన వ్యక్తి నేడు వాటిపై ప్రజలకు సమాధానం చెప్పేందుకు శాసనసభకు రాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆక్షేపించారు. ఎదురు దాడి చేసేందుకు 24 గంటలూ కుట్రలు చేయటం కాదని బాధ్యతాయుతంగా జవాబు చెప్పాలని సవాలు చేశారు.

**కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోలేదు :** 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు 1.14 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 325 మందిని షార్ట్‌లిస్ట్ చేశారని. ఎంతో శ్రమించి అభ్యర్థులు ఉద్యోగాలు సాధించుకునే ఈ పరీక్షల నిర్వహణలో నిబంధనలను పూర్తిగా విస్మరించారని సీఎం అన్నారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను సైతం అత్యంత భద్రత మధ్య పోలీసు ఎస్కార్టుతో తరలిస్తామని, అలాంటిది రాష్ట్రాన్ని పాలించే అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్షల జవాబు పత్రాల విషయంలో భద్రతను గాలికి వదిలేసి ఇష్టానుసారం వ్యవహరించారన్నారు. డిజిటల్ మూల్యాంకనాన్ని పక్కనపెట్టి మాన్యువల్ ఎవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ కోర్టును తప్పు దోవ పట్టించేలా అఫిడవిట్లు దాఖలు చేశారని చంద్రబాబు అన్నారు. కోర్టు ఆదేశాల తర్వాత సరిదిద్దుకోవాల్సింది పోయి హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం కోసం రూ.1.19 కోట్ల విలువైన పనులకు ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఒకవైపు కోర్టు ఆదేశాలు ఉండగానే ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు కూడా చేపట్టారని తెలిపారు. హైకోర్టు ఈ వ్యవహారంపై విచారణ జరిపి విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు.

**ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు :** గ్రూప్-1 వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలకు అభ్యర్థులు రాసిన పరీక్షా పత్రాలను అర్హత లేని ప్రైవేటు వ్యక్తులతో దిద్దించారని సీఎం మండిపడ్డారు. ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు, గృహిణులు, నిరుద్యోగులు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, హెచ్‌ఓడీలు వంటి నిపుణులు చేయాల్సిన మూల్యాంకనాన్ని టీచర్లు, లెక్చరర్లు, ఇతర అనర్హులతో చేయించడం తీవ్ర ఉల్లంఘన అని అన్నారు. మిగతా 2లో...



# డేటా సెంటర్లపై అపోహలు వద్దు



- 6.5 గిగావాట్ల లక్ష్యం పూర్తి
- గూగుల్ రాకతో గ్లోబల్ సంస్థల క్యూ
- ఐటీ.. ఏఐ.. ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్‌తో వేలాది ఉద్యోగాలు
- డేటా సెంటర్లపై దుష్ప్రచారం నమ్మొద్దు: లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 6.5 గిగావాట్లకు మించకుండా లక్ష్యాన్ని పూర్తి చేశామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అసెంబ్లీలో డేటా సెంటర్లపై వస్తున్న అపోహలపై నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... కొంతమంది కావాలని డేటా సెంటర్లపై అపోహలు సృష్టిస్తున్నారు. గూగుల్ అనే సంస్థ విశాఖ వస్తున్నామని ప్రకటించాకే ఐటి సంస్థలు విశాఖవైపు చూస్తున్నాయి. మనమంతా వాడే స్మార్ట్ ఫోన్ అందులో వినియోగించే ఎఐ డేటా సెంటర్లతో ముడిపడి ఉంది. 1995లో చంద్రబాబు ఐటి నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆ ప్రక్రియలో పనిచేసే ఎంప్లాయ్ చనిపోయారు. అప్పుడున్న ప్రతిపక్షం వాళ్లు కంప్యూటర్ రేడియేషన్ వల్ల ఆ ఎంప్లాయ్ చనిపోయారని ఆరోపణలు చేశారు. అప్పుడు వెనక్కి తగ్గి ఉంటే, హైదరాబాద్ ఈరోజు ప్రస్తుత స్థాయికి వచ్చేది కాదు. మిగతా 2లో...

## డిగ్రీ కాలేజీలకు సొంత 'గూడు'!

- 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు
- 37 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలపై పరిశీలన
- అమరావతిలో దేశంలోనే అత్యుత్తమ సెంట్రల్ లైబ్రరీ
- ఆళ్లగడ్డ డిగ్రీ కళాశాలకు నూతన భవనం: మంత్రి లోకేష్

2లో

# అవయవదానానికి కొత్త 'నిబంధనలు'!



- 'స్వాప్ దానం'కు చట్టబద్ధ అవకాశం
- తాత, అవ్వ, మేనమామ, మేనత్తలకూ దగ్గరి బంధువుల గుర్తింపు
- అక్రమ అవయవ వ్యాపారానికి రూ.కోటి వరకు జరిమానా
- బ్రెయిన్‌డెడ్ దాత కుటుంబానికి రూ.లక్ష సాయం ప్రతిపాదన: మంత్రి సత్యకుమార్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జీవన్మృతుల ( బ్రెయిన్‌డెడ్ ) వ్యక్తుల అవయవదానానికి ముందుకొచ్చే కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.10,000 నుంచి ఆర్థిక సాయాన్ని రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు-2026పై బుధవారం శాసనసభలో ప్రవేశ పెట్టిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. అవయవదానం, ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులు, బిల్లులోని ముఖ్యాంశాల గురించి వివరించారు. ఒక బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి ఎనిమిది అవయవాలను సేకరించి అవసరమైన వారికి అందించవచ్చని మంత్రి తెలిపారు.

**5,920 మంది నిరీక్షణ :** రాష్ట్రంలో సుమారు 5,920 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వీరిలో దాదాపు 100 మంది గుండె, 3,000 మంది కిడ్నీ, 2,000 మంది లివర్ మార్పిడి కోసం నిరీక్షిస్తున్నారని మంత్రి వివరించారు. మిగతా 2లో...

## ఏలేరుకు జల'భరోసా'!

- రెండేళ్లలో 548 పనులకు రూ.25 కోట్లు
- పోలవరం ఎడమ కాలువకు రూ.1,800 కోట్లు.. కీలక క్రాసింగ్ పనులు పూర్తి
- 53 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు.. ప్రజలకు తాగునీరు
- నిరంతర నీటి సరఫరానే లక్ష్యం: మంత్రి నిమ్మల

2లో

## స్థానిక పోరుకు రంగం సిద్ధం!

- 100 పురపాలక సంస్థల్లో ఎన్నికలకు సిద్ధం
- బీసీలకు 33.33% రిజర్వేషన్ యథాతథం
- స్థానిక ఎన్నికల షెడ్యూల్‌కు కౌంట్‌డౌన్





2లో

**అమరావతి, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం వేగంగా కసరత్తు

# త్యాగాలకు తగిన పరిహారం!

- వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల సాయం
- ఇప్పటివరకు 4,157 కుటుంబాలకు రూ.518 కోట్ల చెల్లింపు
- ఆరు పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల పనులు పూర్తి
- మిగతా పరిహారమూ త్వరలోనే విడుదల: సీఎం చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ... నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం... బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది మిగతా 2లో...



## వ్యాపారానికి 'స్పీడ్'.. బిల్లుకు ఆమోదం!

- వ్యాపార అనుమతుల్లో జాప్యానికి చెక్
- సింగిల్ విండోలో పర్యవేక్షణ.. తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీ
- సేవలు అందకపోతే దరఖాస్తుదారుడి ప్రమేయం లేకుండానే ఆటో-అప్పీల్
- ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ బిల్లు-2026కు సభ ఆమోదం
- సభలో బిల్లును ప్రవేశపెట్టిన న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

2లో

## స్వర్ణ ఉద్యోగులకు 'స్వర్ణ' భవిష్యత్తు!

- స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులందరికీ ప్రమోషన్లు
- కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్యలు పరిష్కరిస్తున్నాం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

2లో

# జూనియర్ డాక్టర్లపై ప్రభుత్వం ఔదార్యం

**అమరావతి, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లకు ప్రభుత్వం కీలక ప్రతిపాదన చేసింది. ఇంటర్న్‌లు, పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థుల స్టైపెండ్‌ను ఇకపై ప్రతి ఏడాది క్రమబద్ధంగా సవరించే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రెండేళ్లకోసారి జరిగే సవరణకు బదులుగా, వార్షిక పెంపు అమలు చేసే శాశ్వత విధానాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు.


ప్రతిపాదన ప్రకారం ఇంటర్న్‌షిప్ చేస్తున్న వైద్య విద్యార్థులకు ఈ ఏడాది జనవరి 1 నుంచి 5 శాతం స్టైపెండ్ పెంపు వర్తింపజేయనున్నారు. అనంతరం ప్రతి విద్యా సంవత్సరం 3 శాతం చొప్పున ఆటోమేటిక్ పెంపు అమలు చేయాలని మిగతా 2లో...

- స్టైపండ్ 5 శాతం పెంచుతూ నిర్ణయం
- ప్రతి ఏడాది కూడా 3 శాతం చొప్పున పెంపు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్



## త్యాగాలకు తగిన పరిహారం!



(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

**రూ.518 కోట్ల మేర పరిహారం అందజేత** : వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకు గానూ ఓటీఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ. 318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ. 200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించారు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ. 518 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్టైంది. నిర్వాసితుల కోసం 7 పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

## వ్యాపారానికి 'స్పీడ్'.. బిల్లుకు ఆమోదం!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు-2026కు శాసనసభ ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాలు మూడవ రోజున స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రవేశపెట్టారు. మంత్రి ఫరూక్ ప్రవేశపెట్టిన బిల్లులోని ముఖ్యాంశాలను ప్రశంసిస్తూ వాటికి పూర్తి మద్దతు తెలుపుతూ బిల్లును ఆమోదించాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. ప్రతిపాదనలకు సభ్యుల ఆమోదంతో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

బిల్లును ప్రవేశపెట్టినప్పుడు మంత్రి ఫరూక్ శాసనసభలో బిల్లు ముఖ్య ఉద్దేశంతో పాటు అందుబాటులోకి వచ్చే సులభతరమైన విధానాలను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లుతో రాష్ట్రంలో విశ్వాస-ఆధారిత నియంత్రణ చట్రాన్ని పెంపొందించుటకు, పౌరుల యొక్క జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుచుటకు, మరియు కార్యకలాపాల నిర్వహణను వేగవంతం చేయుటను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సూచించిన నియంత్రణల సడలింపు, అనుసరణ భారాన్ని తగ్గించే సంస్కరణలను అమలు చేయడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని మంత్రి వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీస్ చట్టం-1999 క్రింద ఫైర్ సేఫ్టీ నిబంధనలకు అంతర్జాతీయ ప్రమాణాలు మరియు మార్గదర్శకాలు ఆధారంగా ఉండేలా చేసినట్లు, నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు సంబంధించిన ప్రస్తావనలను తొలగించినట్లు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ల పునరుద్ధరణ కోసం థర్డ్-పార్టీ ఫైర్ ఆడిట్ ఏజెన్సీలు అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి, వాటి ఎంపానెల్మెంట్కు సంబంధించిన అర్హతలు, ప్రమాణాలు, విధులు, పర్యవేక్షణ మరియు క్రమశిక్షణా నిబంధనలను చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ సింగిల్ విండో క్లియరెన్స్ చట్టం- 2002 కింద పరిశ్రమలకు సంబంధించిన అనుమతులపై క్రమబద్ధమైన పర్యవేక్షణ, స్పష్టమైన అధికారాలతో పాటు తప్పనిసరి ఎస్కలేషన్ అథారిటీతో కూడిన రాష్ట్ర మరియు జిల్లా కమిటీలతో కూడిన రెండు అంచెల సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడాన్ని ప్రతిపాదించామని వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టం- 2017 లో సేవలు తిరస్కరించబడినప్పుడు లేదా నిర్ణీత గడువులో అందించనప్పుడు, దరఖాస్తుదారులు తామే స్వయంగా అప్పీల్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండా ఆటో-అప్పీల్ విధానం ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు. ఏదైనా సేవ తిరస్కరించబడినా లేదా నిర్ణీత గడువులో అందించబడకపోయినా, అప్పీల్ స్వయంచాలకంగా దాఖలైనట్లుగా పరిగణించబడుతుందన్నారు. అప్పీలేట్ అథారిటీ 21 రోజుల్లోపు ఆ అప్పీల్‌ను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే సేవను అందించమని ఆదేశించడంతో పాటు, పరిహారం చెల్లించాల్సిందిగా కూడా ఆదేశించవచ్చునని పేర్కొంటూ మంత్రి ఫరూక్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ బిల్లును ప్రవేశపెట్టగా శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

## స్వర్ణ ఉద్యోగులకు 'స్వర్ణ' భవిష్యత్తు!




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : వైసీపీ హయాంలో కక్షపూరితంగా ఇష్టానుసారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేశారని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయ్ కుమార్ లు హౌస్ హోల్డింగ్ మ్యాప్ అంశంపై అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ..వైసీపీ హయాంలో కక్షపూరితంగా ఇష్టానుసారంగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేశారు. ఒక జిల్లాలో ఉన్న వ్యక్తిని తీసుకెళ్లి మరో జిల్లాలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ లో చేర్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సమస్యలు పరిష్కరిస్తున్నాం, రేషన్ కార్డుల్లో మార్పులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్ ల్లో మార్పులు, చేర్పులపై ప్రజల నుంచి వచ్చిన 2 లక్షల 16 వేల వినతులు పరిష్కరించాం. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆయా డిపార్ట్మెంటులు ప్రతిపాదనలు పంపాయి. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల్లో పనిచేసే ప్రతి ఉద్యోగికి ప్రమోషన్లు కల్పిస్తామని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# గ్రూప్-1లో అంతా 'తేడా'!

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 158 మంది ప్యానల్‌ను ఎంపిక చేసి అందులో 72 మందికి మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని, వారిలో 25 మంది అనధికారికంగా నియమించిన వారేనని చంద్రబాబు తెలిపారు. మరో 66 మంది ఎవాల్యుయేటర్లు అనధికారికంగా పరీక్ష పత్రాలు దిద్దారని ఆరోపించారు. ప్రైవేటు వ్యక్తుల ల్యాప్‌టాప్‌లకు పరీక్షా మూల్యాంకన వివరాలను పంపించారని, పీడీఎఫ్ జవాబు పత్రాలను ప్రైవేటు ఈ-మెయిళ్లు, గూగుల్ డ్రైవ్, వాట్సప్ ద్వారా పంపించారని చెప్పారు. ఏపీపీఎస్సీ స్ట్రాంగ్ రూమ్ నుంచి జవాబు పత్రాలను అనధికారికంగా తరలించి 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో ఉంచారని సీఎం తెలిపారు. మొదట హైదరాబాద్‌లో, ఆ తర్వాత హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం నిర్వహించారని చెప్పారు. హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం జరగలేదని హైకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిన సమయంలోనే లాజిస్టిక్స్ కోసం రూ. 1.14 కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు.



**డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు** : కొత్త చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశాలు ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్‌లు ముద్రించినట్లు చెప్పారు. జవాబు పత్రాల్లో వేర్వేరు రాతలు, మార్పులు, చేర్పులు, ఓవర్‌రైటింగ్‌లు గుర్తించారని తెలిపారు. 734 ఓఎంఆర్ స్లిప్‌లలో 718 స్లిప్‌లలో మార్పులు జరిగినట్లు వెల్లడించారు. 21 స్లిప్‌లపై ఎలాంటి సంతకాలు లేకపోవడం అక్రమాల తీవ్రతకు నిదర్శనమన్నారు. గ్రూప్--1 పరీక్ష రాసిన ఒక అభ్యర్థినే అదే పరీక్షకు ఎవాల్యుయేషన్ ఎగ్జామినర్‌గా నియమించడం మరింత దారుణమని సీఎం అన్నారు. ఎగ్జామినర్ల జాబితాలను వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో పెట్టారని తెలిపారు. మూల్యాంకనం జరిగే హాల్లో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకపోవడం, మొబైల్ ఫోన్లను అనుమతించడం వంటి దారుణాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. ఏపీపీఎస్సీ నిబంధనల ప్రకారం వైటనర్ వినియోగించకూడదని స్పష్టం చేస్తుండగా, ఓఎంఆర్ వాల్యుయేషన్ స్లిప్‌లలో వైటనర్ వినియోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నివేదికలు వెల్లడించాయని చంద్రబాబు తెలిపారు.

**వ్యవస్థలు యువత భవిష్యత్తు కోసమే** : 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని చాలా సార్లు చెప్పానని సీఎం గుర్తుచేశారు. ప్రజా వేదిక నుంచి రాష్ట్ర బ్రాండ్ వరకు దెబ్బతీశారని, ప్రభుత్వంలోని వివిధ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం పోయేలా గత పాలకులు వ్యవహరించారని విమర్శించారు. వ్యక్తుల కోసం వ్యవస్థ కాదు.. యువత భవిష్యత్తు కోసమే వ్యవస్థ. తప్పు చేస్తే కఠినంగా శిక్ష పడుతున్న భయం ఉండాలని అన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, ఇక్కడి నుంచే ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ఉందని చంద్రబాబు అన్నారు. తప్పు చేసి పారిపోవడం కాదని, ఎందుకు జరిగిందో చెప్పాల్సిన బాధ్యత సంబంధిత వ్యక్తులపై ఉందన్నారు. గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అక్రమాలను పూర్తిగా విశ్లేషించి తదుపరి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు చెప్పారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని పారదర్శకమైన మూల్యాంకన విధానం, బలమైన భద్రతా ప్రమాణాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు తీసుకుని సంస్కరణలు చేపడతామని వెల్లడించారు. ఇలాంటి అక్రమాలు మళ్లీ జరగకుండా వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. తప్పు చేసిన వ్యక్తులు ఎప్పటికైనా దొరికిపోతారు అనడానికి ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలే ఉదాహరణ అని సీఎం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంత దారుణమైన కుంభ కోణం జరిగితే రాష్ట్ర భవిష్యత్తు ఏమిటో ప్రజలు ఆలోచించాలని ముఖ్యమంత్రి అన్నారు.

# డిగ్రీ కాలేజీలకు సొంత 'గూడు'!

- **175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు**
- **37 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలపై పరిశీలన**
- **అమరావతిలో దేశంలోనే అత్యుత్తమ సెంట్రల్ లైబ్రరీ**
- **ఆళ్లగడ్డ డిగ్రీ కళాశాలకు నూతన భవనం: మంత్రి లోకేష్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రంలో 37 డిగ్రీ కాలేజీలకు సొంతభవనాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తోందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆళ్లగడ్డలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తగినన్ని తరగతి గదులు, శాశ్వత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, శాశ్వత భవనాల నిర్మాణానికి నిధుల కేటాయింపుపై ప్రభుత్వం వద్ద ఉన్న ప్రతిపాదనలకు సంబంధించి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... ఒక్కొక్క డిగ్రీకాలేజీ పూర్తిచేసి అన్నిహంగులు కల్పించడానికి రూ. 15కోట్లు ఖర్చవుతుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు మొత్తం ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇదే సమయంలో నిధులు కూడా సమకూర్చుకోవాల్సిఉంది. ఆళ్లగడ్డకు డిగ్రీ కాలేజీకి సంబంధించి మొదటి సంవత్సరం కేవలం 18మంది పిల్లలు ఉంటే, 2025-26 సంవత్సరానికి 103మంది విద్యార్థులు డిగ్రీ కాలేజీలో చేరారు. ఈ కళాశాలకు కావాల్సిన భూమి ఉంది, ఇన్ ఫ్రాస్ట్రక్చర్, భవనాలు, ప్రత్యేకంగా క్లాస్ రూములు కావాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి గతంలో అక్కడకు వెళ్లినపుడు కాంపౌండ్ వాల్ ధ్వంసం చేశారు, తిరిగి కట్టించాలని ఎమ్మెల్యే అఖిల ప్రియ అడిగారు. ఈ మొత్తాన్ని ఎస్టిమేట్ చేసి ప్రత్యేకంగా సాస్కి స్కీమ్ కింద పూర్తిచేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. అవసరమైన మేరకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు కూడా భర్తీచేస్తాం. ఇంకా అవసరమైన ల్యాబ్స్, కంప్యూటర్స్, బెంచీలు హామీ ఇచ్చిన మేరకు ఎమ్మెల్యే పి4 కింద సమకూర్చుకోవాలని మంత్రి సూచించారు.

**9నెలల్లో కడప గ్రంథాలయ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం** : కడపలో లైబ్రరీకి సంబంధించి ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవీరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రంథాలయాలపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టడం జరిగింది. ప్రత్యేకించి మంగళగిరిలో ఒక మోడల్ లైబ్రరీ ఏర్పాటు చేశాం. సుమారు కోటిరూపాయలతో ఇక్కడ పిల్లలకు అవసరమైన వసతులు, కాంపిటీటివ్ పుస్తకాలు, ఇతర సౌకర్యాలు కల్పించాం. దీనివల్ల రాత్రి 8గంటలకు కూడా అక్కడ 300 మంది వరకు ఉండి పోటీపరీక్షలకు ప్రిపేరవుతున్నారు. నియోజకవర్గం, జిల్లా, జోనల్, సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. కొన్నిచోట్ల ఉన్న ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను బలోపేతం చేసి, కొత్త ఇన్ ఫ్రా ఏర్పాటు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వంలో జిల్లా గ్రంథాలయాలకు చేరాల్సిన సెస్సును సిఎఫ్ఎంఎస్ ద్వారా డైరక్ట్ గా ట్రెజరీకి తెచ్చారు. ఆ విషయాన్ని సిఎం, ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఈ ఏడాది నుంచి ఆ నిధులు మా శాఖకు అందిస్తున్నారు. తొమ్మిదినెలల్లో కడప గ్రంథాలయాన్ని పూర్తిచేసే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు వారి ప్రాంతాల్లో పారిశ్రామికవేత్తలు, ఉన్నత స్థానాలకు చేరిన అలూమినీల ద్వారా నిధులు సమకూరిస్తే గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయడానికి అవకాశమేర్పడుతుంది. గుంటూరులో ఎంపి, ఎమ్మెల్యేలు సంయుక్తంగా సిఎస్ఆర్ నిధులతో జోనల్ గ్రంథాలయాన్ని అభివృద్ధి చేశారు. మండలి బుద్ధప్రసాద్ సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని కోరారు. సెంట్రల్ లైబ్రరీ, గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ రెండూ ఇంటిగ్రేట్ చేసి అద్భుతమైన సెంట్రల్ లైబ్రరీ, ట్రైనింగ్ సెంటర్, తెలుగు కల్చరల్ సెంటర్ అమరావతిలో ఒకే క్యాంపస్ లో ఏర్పాటు చేస్తాం. త్వరలో డిజైన్ ఫైనలైజ్ చేసి దేశంలోనే అత్యుత్తమ సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటుచేసే బాధ్యత తమదని మంత్రి లోకేష్ అన్నారు. చదవడం వల్ల క్రియేటివిటీ, కొత్తకొత్త ఐడియాలు వస్తాయి. పిల్లలను స్మార్ట్ ఫోన్లు, ఐప్యాడ్ లకు దూరం పెట్టడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర వహిస్తాయి. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటాం. కొన్నిచోట్ల ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుచేయాలి. ఇందుకు ఒక కార్యాచరణ రూపొందించాం. రాబోయే మూడేళ్లలో అవి పూర్తిచేస్తామని మంత్రి లోకేష్ చెప్పారు. విశాఖపట్నంలో ఉన్న అద్భుతమైన జోనల్ లైబ్రరీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. అది ఆంధ్రాయూనివర్సిటీ కేంద్రంగా ఏర్పాటుచేస్తే విద్యార్థులు, యువతకు పోటీపరీక్షలకు ఉపయోగకరంగా ఉంటుంది. అమరావతిలో సెంట్రల్ లైబ్రరీకి దీటుగా విశాఖలో ఏర్పాటుచేస్తాం. రాయలసీమ కేంద్రంగా కూడా అద్భుతంగా, అన్నిహంగులతో జోనల్ లైబ్రరీ యాంపి థియేటర్, ఆడిటోరియం, పోటీపరీక్షలకు కావాల్సిన పుస్తకాలు ఎకోసిస్టమ్ ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్ చెప్పారు.

## జూనియర్ డాక్టర్లపై ప్రభుత్వం ఔదార్యం




(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించింది. పీజీ, సూపర్ స్పెషాలిటీ పీజీ విద్యార్థులకు కూడా ప్రస్తుతం చెల్లిస్తున్న స్టైపెండ్‌పై ప్రతి ఏడాది 3 శాతం పెంపు ఇవ్వనున్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ మాట్లాడుతూ, భవిష్యత్తులో స్టైపెండ్ సవరణపై స్పష్టమైన, శాశ్వత విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అమలవుతున్న వార్షిక పెంపు విధానాన్ని పరిశీలించి ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే తరహా వ్యవస్థను ప్రతిపాదించినట్లు వెల్లడించారు.

ఇదిలా ఉండగా, స్టైపెండ్‌ను 15 శాతం పెంచాలన్న డిమాండ్‌తో ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళన కొనసాగుతోంది. ఈ నెల 11న ప్రారంభమైన సమ్మె మొదటి, రెండో దశల్లో అత్యవసర సేవలు కొనసాగించిన జూడాలు, 17 నుంచి మూడో దశలో అత్యవసర సేవలతో పాటు అన్ని వైద్య సేవలను నిలిపివేసి సమ్మెను తీవ్రతరం చేశాయి.

జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. సెకండరీ హెల్త్, పబ్లిక్ హెల్త్ విభాగాలకు చెందిన వైద్యులను అందుబాటులోకి తీసుకువచ్చి ఓపీ, ఐపీ, శస్త్రచికిత్సలు, డయాలసిస్, ట్రామా సేవలను కొనసాగిస్తోంది.

జూడా ప్రతినిధులతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పలుమార్లు చర్చలు జరిపినా పూర్తి స్థాయి ఒప్పందం కుదరలేదు. అయితే ప్రభుత్వం ప్రకటించిన వార్షిక స్టైపెండ్ సవరణ ప్రతిపాదనతో సమ్మెకు పరిష్కారం దొరికే అవకాశాలపై వైద్య వర్గాల్లో చర్చ సాగుతోంది.

# డేటా సెంటర్లపై అపోహలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

డేటా సెంటర్లపై వస్తున్న అపోహలు కూడా అలాంటివే.

**గోదావరి నీరు ఏటా 3వేల టీఎంసీలు వృథా..డేటా సెంటర్‌కు 3 టీఎంసీల నీరు** : డేటా సెంటర్లకు సంబంధించి మేడమ్ మాధవి గారు మూడు సమస్యలు చెప్పారు. మొదటిది నీటి భద్రత...గోదావరి నుంచి ఐదేళ్ల సరాసరి తీసుకుంటే సాధారణంగా ప్రతిఏటా 3వేల టిఎంసిల నీరు బంగాళాఖాతంలో వృధాగా పోతోంది. మనం ఆ నీటిలో కొంతభాగాన్ని పోలవరంలోకి మళ్లించి గ్రావిటీ ద్వారా విశాఖకు తీసుకువస్తున్నాం. ప్రస్తుత సాంకేతికత ప్రకారం 6.5 గిగావాట్ల డేటా సెంటర్లు విశాఖలో ఇన్ స్టాల్ అయితే 3 టిఎంసిల నీరు అవసరమవుతుంది. నేను పోలో ఆల్టో ఇంటెల్ ఏర్పాటుచేసిన డేటా సెంటర్ ను స్వయంగా చూశాను. అక్కడ వాటర్ కూల్ టెక్నాలజీ లేదు, అంతా ఎయిర్ కూల్ టెక్నాలజీ వాడుతున్నారు. ఇంకా కొత్త టెక్నాలజీలు వస్తున్నాయి. నీటి వినియోగం మరింత తగ్గించుకుంటూ వస్తున్నారు. ఎనర్జీ అవసరాలు కూడా తగ్గించే టెక్నాలజీ రాబోతోంది. పోలవరం నుంచి వస్తున్న నీరు ప్రత్యేకంగా విశాఖపట్నం నగర ప్రజల తాగు, సాగు, పరిశ్రమల అవసరాలకు కేటాయింపులు జరిగాయి. పరిశ్రమలకు కేటాయించిన నీటి వాటా నుంచే డేటా సెంటర్లకు అవసరమైన నీరందిస్తాం. రాబోయే 18నెలల్లో పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా విశాఖ ప్రజలకు తాగునీరు అందిస్తాం. డేటా సెంటర్లకు డెడికేటెడ్ పైప్ లైన్ ద్వారా నీరు అందిస్తాం తప్ప సిటీ ఇన్ ఫ్రా నుంచి మళ్లించేది లేదు.

**థర్మల్ ప్లాంటులపై మాట్లాడరెందుకు?** : 1 గిగావాట్ థర్మల్ పవర్ ప్రాజెక్టు డేటా సెంటర్ ఉపయోగించే నీటి కంటే పదిరెట్లు ఎక్కువగా వినియోగిస్తుంది. విశాఖలో ఇప్పుడు డేటా సెంటర్లపై ధర్నా చేస్తున్నవారు ఏనాడు థర్మల్ ప్లాంట్ గురించి మాట్లాడలేదు. ఎనర్జీ కావాలి, డేటా సెంటర్ వద్దనడం ఎలా సబబు? ఈరోజు ఉన్న పరిస్థితుల్లో ఎఐ అనివార్యం. అది మన జీవితం భాగమైంది. గూగుల్ పెద్దఎత్తున పెట్టుబడి పెట్టడానికి ముందుకు రావడం వల్లే మిగిలిన గ్లోబల్ సంస్థలు విశాఖలో తమ డేటా సెంటర్లకు భూములు కేటాయించాలని అడుగుతున్నాయి.



**వన్ నేషన్- వన్ గ్రిడ్‌తో ఎంతో మేలు** : విద్యుత్ కు సంబంధించి వెస్ట్రన్ గ్రిడ్ కు, ఇండియన్ గ్రిడ్ కు చాలా తేడా ఉంది. మన వద్ద వన్ నేషన్ - వన్ గ్రిడ్ వ్యవస్థను నరేంద్రమోదీ నాయకత్వంలో తెచ్చారు. దీనివల్ల రాయలసీమలో తయారుచేసే రెన్యువబుల్ ఎనర్జీ నార్త్ ఇండియాకు కూడా పంపించే అవకాశం ఉంది. డేటా సెంటర్లు కనీసం 70శాతం గ్రీన్ ఎనర్జీ వాడాలని స్పష్టంగా చెప్పాం. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌నే వాడాలని వారికి చెప్పాం. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా మంత్రి గొట్టిపాటి నాయకత్వంలో డిస్ట్రిబ్యూషన్ లైసెన్సు కూడా ఇచ్చాం. విద్యుత్ ఛార్జీల విషయంలో ఎలాంటి పెంపుదల ఉండదు. విద్యుత్ ఛార్జీలు ఎట్టి పరిస్థితుల్లో పెంచేది లేదని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నారు. పెంచకపోగా ఈ ఏడాది 13పైసలు విద్యుత్ చార్జీలు తగ్గించిన ఘనత ఎన్డీఏప్రభుత్వానిది. ప్రత్యేకించి ఒక సంస్థ 100 ఎంఎల్ డి డిశాలినేషన్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తోంది. దానికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**ఎకో సిస్టమ్ వస్తుంది..ఉద్యోగాలు తెస్తుంది** : డేటా సెంటర్ల వల్ల ఉద్యోగాలు వస్తాయా అనే చర్చ జరుగుతోంది. డేటా సెంటర్ చుట్టూ ఎకో సిస్టమ్ చాలా ముఖ్యం. ఎఐ డేటా సెంటర్స్ వస్తున్నాయి. అడ్వాన్స్ డ్స్ చిప్స్ రావాలి. ఆ చిప్స్ ను ఈరోజు గూగుల్ తీసుకువస్తుంది. దానివల్ల ఎఐకి సంబంధించిన కటింగ్ ఎడ్జ్, ఇతర కంపెనీలు విశాఖపట్నాన్ని కేంద్రంగా చేసుకుంటాయి. భారీ ఎత్తున వస్తున్న డేటా సెంటర్ ఎకోసిస్టమ్ కు ఎయిర్ కూలింగ్ సిస్టమ్ అవసరం. ప్రతి ఐదేళ్లకు దానిని అప్ గ్రేడ్ చేయాల్సి ఉంటుంది. దానివల్ల ఈరోజు కెరీర్, ఎల్జీ ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయి. మరో కంపెనీ కూడా ఈరోజు ఏపీకి వస్తోంది. రైజింగ్ రాయలసీమలో మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేస్తున్నందున అక్కడ కేవలం కూలింగ్ ఎకోసిస్టమ్ వల్ల 20వేలమందికి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించబోతున్నాం.

**రాష్ట్రవ్యాప్తంగా అనుబంధ సంస్థలు వస్తున్నాయి**: పవర్ జనరేషన్, ట్రాన్స్ మిషన్ లైన్లు... 6.5 గిగావాట్ల డేటా సెంటర్లకు సరిపడా వరల్డ్ క్లాస్ డేటా సెంటర్లు తీసుకురావాల్సిన బాధ్యత మనపై ఉంది. అందులో భాగంగా మరికొన్ని కంపెనీలు విశాఖలో భూములు అడుగుతున్నారు. వరల్డ్ క్లాస్ ట్రాన్స్ ఫార్మర్ల తయారీ, డెలివరీ కోసం ఇన్ ఫ్రా కావాలని కోరుతున్నారు. అది కూడా విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేస్తాం. పవర్ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు కూడా ఈరోజు రాయలసీమకు వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయి. అక్కడ ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్ ఉన్నందునే అక్కడే పవర్ ఎలక్ట్రానిక్స్ వస్తున్నాయి. అందువల్ల పవర్ ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేస్తున్నాం. ఫైబర్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలను కూడా ఏపీకి తీసుకువస్తున్నాం. విశాఖలో మూడు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటుచేసి గ్లోబల్ ల్యాండింగ్ తో అనుసంధానిస్తున్నాం. దీనివల్ల ఐటి, జిసిసి, ఐటి అనుబంధ పరిశ్రమలు వస్తాయి. డేటా సెంటర్ల వల్ల లాజిస్టిక్స్, రియల్ ఎస్టేట్ సపోర్టింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ విశాఖ కేంద్రంగా తయారవుతోంది. గూగుల్ తో ఒప్పందం కుదుర్చుకున్న ఒక లాజిస్టిక్స్ సంస్థ వెయ్యికోట్ల పెట్టుబడి పెట్టబోతోంది. సర్వర్, పవర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్సఫార్మర్లు, కేబుల్స్ స్టోర్ చేయడానికి విశాఖ కేంద్రంగా మరో ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తాం. దీనివల్ల వేర్ హౌసింగ్, కమర్షియల్, రెసిడెన్షియల్, ట్రాన్స్ పోర్టేషన్, హాస్పిటాలిటీ, రిటైల్, మెయింటెనెన్స్, సర్వీసెస్ లో పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**విశాఖపట్నం..ఇక ఏఐ పట్నం** : అశ్వనీ వైష్ణవ్ గూగుల్ శంకుస్థాపనకు వచ్చినపుడు ఇక విశాఖపట్నం కాదు... ఎఐ పట్నంగా మారబోతోంది అని చెప్పారు. విశాఖ గేట్ వే ఆఫ్ ఇండియా ఎఐ ఎకో సిస్టమ్ మార్చడం మా కమిట్మెంట్. దీంతోపాటు రియల్ ఎస్టేట్ వారు జిసిసిలు, ఐటి సెజ్ లు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారు. మరో ముఖ్యమైన విషయం ఒక అమెరికన్ యూనివర్సిటీ ఎఐ రిలేటెడ్ సబ్జెక్ట్ తో విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేయబోతున్నారు. ఆ పేరు ఇప్పుడు చెప్పడం ఒప్పందం ప్రకారం కుదరదు కనుక చెప్పడంలేదు.

**కావాలనే అపోహలు సృష్టిస్తున్నారు** : కావాలని కొందరు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. ఎక్కడా పర్యావరణ ఉల్లంఘనలు చేయడం లేదు. కొంతమంది కావాలని దొంగ వీడియోలు తీసుకొచ్చి ఏదో అయిపోతుందని చెప్పే మాటలను పట్టించుకోవద్దు. స్టాన్ఫోర్డ్ వర్సిటీ సమీపంలో పోలో వోల్టో డేటా సెంటర్ స్వయంగా చూశాను. కనీసం అక్కడ ఉన్నట్లు కూడా మాకు తెలియలేదు. దయచేసి విశాఖప్రజలు దుష్ప్రచారం నమ్మవద్దు, మేం పట్టుదల, కమిట్ మెంట్ తో పనిచేస్తున్నాం. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో డేటా సెంటర్ మన గడ్డపై ఉండాల్సిన అవసరం చాలా ఉంది. కొత్తగా ఎఐ స్మార్ట్ ఫోన్లు, డివైజ్ లు వస్తున్నాయి. ఆ డేటా అంతా ఎఐ డేటా సెంటర్ లో స్టోర్ అవుతుంది. ఐదేళల్లో ఆపరేటింగ్ సిస్టమ్స్ కూడా మారబోతున్నాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కష్టపడి పెట్టుబడులు తీసుకువస్తున్నాం. అపోహలు అస్సలు నమ్మొద్దు. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ లో రెన్యువబుల్ ఎనర్జీ వాడి గ్రీన్ స్టీల్ తయారు చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుచేసేపుడు భూమిని చదును చేయాలి. దానిని ప్రకృతి విధ్వంసం అనడం ఎంతవరకు న్యాయమో ప్రజలు ఆలోచించాలి. అభివృద్ధి జరిగే సమయంలో ప్రకృతిపై కొంత భారం ఉంటుంది. దానిని కనీస స్థాయిలో తగ్గించేందుకు ఒక కార్యాచరణ పెట్టుకొని మేం పనిచేస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 2019 ఎదురుగాలిలోనూ విశాఖప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. విశాఖపట్నంపై మాకు కమిట్మెంట్ ఉంది. నూరుశాతం సస్టయినబుల్ మెకానిజంతో డేటా సెంటర్స్, ఐటి ఎకో సిస్టమ్, అనకాపల్లిలో ఫార్మా మ్యానుఫ్యాక్చరింగ్, స్టీల్ ఎకో సిస్టమ్ వస్తున్నాయి. వీటిని ముందుకు తీసుకెళ్లే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి లోకేష్ చెప్పారు.

# అవయవదానానికి కొత్త 'నిబంధనలు'!

(మొదటి పేజీ తరువాయి)

పాంక్రియాస్ మార్పిడి కోసం నలుగురు ఉన్నారని తెలిపారు. పుట్టిన నెల రోజుల వయసున్న శిశువుల నుంచి 90 ఏళ్ల వయసున్నవారి వరకు అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. పదేళ్లలోపు వయసున్న సుమారు 40 మంది పిల్లలు కూడా ఈ జాబితాలో ఉన్నారని వెల్లడించారు.



**అపోహలు తొలగింపులో ఎమ్మెల్యేలూ భాగస్వామ్యం కావాలి :** అవయవదానంపై అపోహలను తొలగించే దిశగా ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్రజల్లో ప్రభావం చూపగల ప్రముఖులను కూడా భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు ద్వారా అవయవదానంపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. అలాగే అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు శాసనసభ్యులు అవయవదానం ప్రాముఖ్యత గురించి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

**ఉద్యోగ కల్పనపై పరిశీలన :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీవన్మృతుల అవయవదానానికి కుటుంబ సభ్యులు ముందుకొస్తే రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నామని, దాత పార్థివ దేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరుగుతున్నాయన్నారు. అలాగే దాతల కుటుంబాల ఆర్థిక నేపథ్యం ఇతర అంశాల ప్రాతిపదికన అర్హులైన వారు ఉంటే పొరుగు సేవలు లేదా ఒప్పంద విధానంలో ఉద్యోగాన్ని ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు

ప్రస్తుతం ఇస్తున్న రూ. 10 వేల సాయాన్ని రూ. లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు స్పష్టం చేశారు.

**మూడు నుంచి తొమ్మిదికి అవయవ మార్పిడి కేంద్రాలు :** రాష్ట్రంలో ఉన్న ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాల సంఖ్యను మూడు నుంచి తొమ్మిదికి పెంచామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అవయవ మార్పిడి సేవలను విస్తరించడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని 12 టీచింగ్ ఆసుపత్రులను కూడా రాబోయే రోజుల్లో ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. కిడ్నీ, లివర్ వంటి అవయవాల మార్పిడిలో ప్రైవేటు ఆసుపత్రుల వాటా ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ రంగంలోనూ ఈ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగంలోని పద్మావతి ఆసుపత్రిలో గత ఏడాది 18 హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరిగినట్లు మంత్రి వెల్లడించారు.

**100 మందికి పైగా దాతలు ముందుకొచ్చేలా కృషి :** ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అవగాహన కార్యక్రమాల ఫలితంగా అవయవదాతల సంఖ్య పెరుగుతోందని మంత్రి తెలిపారు. 2023లో 41 మంది దాతలు ముందుకు రాగా 126 అవయవ మార్పిడులు జరిగాయి. 2024లో 66 మంది దాతలు ముందుకు వచ్చి 210 అవయవ మార్పిడులు జరిగాయి. 2025లో 93 మంది దాతలు ముందుకు రాగా 300 అవయవ మార్పిడులు జరిగాయి. ఈ ఏడాది ఇప్పటికే 74 మంది దాతలు ముందుకు వచ్చారని, 200కు పైగా అవయవ మార్పిడులు జరిగినట్లు మంత్రి తెలిపారు. ఏడాది ముగిసేలోగా 100 మందికి పైగా దాతలు, 400కు పైగా అవయవ మార్పిడులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వం మేరకు ఈ రంగంలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు.

**తాత.. అవ్వలకు అవకాశం :** బిల్లులో పేర్కొన్న కొత్త నిబంధనలతో భార్య, భర్త, తల్లిదండ్రులు, పిల్లలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లతోపాటు తాత, అవ్వ, మేనమామ, మేనత్తలను కూడా దగ్గరి బంధువులుగా గుర్తించను నట్లు మంత్రి తెలిపారు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో అవయవదాన ప్రక్రియను సమన్వయం చేసేందుకు ప్రత్యేక బాధ్యుల నియామకం జరుగుతుందని తెలిపారు తెలిపారు. దాత-గ్రహీతల వివరాలను నమోదు చేసి మార్పిడి ప్రక్రియను పర్యవేక్షిస్తారని చెప్పారు.

**'స్వాప్ దానం'కు అవకాశం :** రెండు కుటుంబాల్లో దాత-గ్రహీతలకు అవయవాలు పరస్పరం సరిపడే పరిస్థితుల్లో 'స్వాప్ దానం'కు అవకాశం లభిస్తుందని తెలిపారు. నిర్దిష్ట వైద్య పరిస్థితుల్లో గుండె ఆగిన తర్వాత కూడా అవయవ సేకరణకు అవకాశం ఉంటుంది. మైనర్ల నుంచి అవయవాలు, కణజాలాల సేకరణపై కఠిన పరిమితులు విధించినట్లు తెలిపారు. విదేశీయులకు అవయవదానం విషయంలో ప్రత్యేక అనుమతి తప్పనిసరి చేశామని, అవయవాల అక్రమ కొనుగోలు, అమ్మకాలు, మధ్యవర్తిత్వాన్ని అరికట్టేందుకు కఠిన శిక్షలు నిబంధనలు రూపొందించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా అవయవం తొలగిస్తే గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు, రూ.20 లక్షల జరిమానా.. అక్రమ వ్యాపారానికి 5-10 ఏళ్ల జైలు, రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానా విధించేలా నిబంధనలు ఉన్నాయని మంత్రి వివరించారు.

**బిల్లుకు ఆమోదం :** అసెంబ్లీలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రవేశపెట్టిన బిల్లుకు చర్చ అనంతరం డిప్యూటీ స్పీకర్ శ్రీ రఘురామ కృష్ణంరాజు ఆమోదం తెలిపారు.

## స్థానిక పోరుకు రంగం సిద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించాయి. పురపాలక ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 33.33 శాతం రిజర్వేషన్లు యథాతథంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే సమయంలో పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదికలు సమర్పించాయి.

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 33.33 శాతంగా కొనసాగించనున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వార్డుల రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాలు, చట్టపరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలోని మొత్తం 123 పుర, నగరపాలక సంస్థల్లో 100 చోట్ల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. వీటిలో ఇప్పటికే 87 పురపాలక సంస్థల పాలకవర్గాల పదవీకాలం మార్చితో ముగియగా, మరో 13 సంస్థల గడువు నవంబరులో పూర్తికానుంది. న్యాయపరమైన వివాదాల కారణంగా 23 పురపాలక సంస్థల్లో ఎన్నికలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

ఇదిలా ఉండగా, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నద్ధతను సమీక్షించారు. ఓటర్ల తుది జాబితాల ప్రదర్శన పూర్తయిందని, ప్రోటోకాల్ ప్రకారం చేపట్టాల్సిన ప్రతి ప్రక్రియను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, ఎన్నికల నిర్వహణపై ముందస్తు కార్యాచరణ కొనసాగుతోందన్నారు.

పురపాలక శాఖ తన నివేదికలో కోర్టు కేసులు పరిష్కారమైన వెంటనే 87 పుర, నగరపాలక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. పునర్విభజనకు సంబంధించిన కేసుల్లో ప్రభుత్వం అనుకూల తీర్పు వస్తే 20 రోజుల్లో అవసరమైన ప్రక్రియ పూర్తి చేయగలమని వెల్లడించింది. మంగళగిరి-తాడేపల్లి, శ్రీకాళహస్తి, కావలి, అల్లూరు వంటి కొన్ని ప్రాంతాలకు సంబంధించిన కేసులు ఉపసంహరణ దశకు చేరుకున్నట్లు సమాచారం.

గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 13,341 గ్రామ పంచాయతీల్లో దాదాపు అన్ని చోట్ల ఎన్నికలు నిర్వహించేందుకు పంచాయతీరాజ్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపింది. కోర్టు కేసులు ఉన్న కొద్దిపాటి పంచాయతీలు మినహా మిగిలిన చోట్ల ఓటర్ల జాబితాలు, వార్డు వారీ ఏర్పాట్లు పూర్తయ్యాయని నివేదికలో పేర్కొంది.

ప్రభుత్వ శాఖల నుంచి సన్నద్ధత నివేదికలు అందడంతో, మిగిలిన న్యాయపరమైన అడ్డంకులు తొలగిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో మరోసారి స్థానిక ఎన్నికల కోలాహలం ప్రారంభమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ఏడు బిల్లులకు శాసనసభ ఆమోదం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన 7 బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా బిల్లులు సభలో ప్రవేశపెట్టేందుకు సభాపతి స్థానం నుంచి ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు బుధవారం అనుమతినివ్వడంతో ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరీ కమిషన్ అమెండ్ మెంట్ బిల్లు - 2026, ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు - 2026, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రైవేట్ స్కిల్ యూనివర్సిటీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ బిల్-2026, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ రిజర్వేషన్ ఇన్ టీచర్స్ కేడర్ బిల్-2026ను మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టగా, ఆంధ్రప్రదేశ్ ఓమ్నిబస్ (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) బిల్లు-2026ను న్యాయశాఖ మంత్రి ఎన్ఎమ్‌డి ఫరూక్, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లును మంత్రి పి నారాయణ, ఆంధ్రప్రదేశ్ మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు-2026ను మంత్రి సత్యకుమార్ యాదవ్ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో జరిగిన చర్చలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. డిఎస్‌సిని నిర్వహించిన విధంగానే పకడ్బందీగా విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ కేలండర్‌లో తొలి విడతగా 1,523 అధ్యాపక పోస్టులను భర్తీ చేసే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వివరించారు. అలాగే గతంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపనకు కనీసం 50 ఎకరాలు ఉండాలనే నిబంధన ఉండేదని, కేంద్ర ప్రభుత్వం.. భూమిపై నిబంధనలు తొలగించిన నేపథ్యంలో రాష్ట్రంలోనూ పదెకరాలకు తగ్గించామని, ఇది సిఆర్‌డిఏ, గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లకు వర్తిస్తుందన్నారు. మిగిలిన ప్రాంతాల్లో బ్రౌన్‌ఫీల్డ్, గ్రీన్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయాలకు 15 ఎకరాలు నిర్ణయించామని, ఇతర అంశాలను సరళతరం చేశామని అన్నారు. తెలుగు భాష పరిరక్షణ, విద్యా విధానంలో అవసరమైన మార్పులపై త్వరలో ఉన్నతస్థాయి సలహా కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తుల అవయవదానానికి ముందుకొచ్చే కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ. 10 వేల నుంచి ఆర్థిక సాయాన్ని రూ. లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లుపై చర్చలో భాగంగా మంత్రి మాట్లాడారు. అవయవదానం, ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులు, బిల్లులోని ముఖ్యాంశాల గురించి వివరించారు. ఒక బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి ఎనిమిది అవయవాలను సేకరించి అవసరమైన వారికి అందించవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 1986 వరకు మేయర్, మున్సిపల్ ఛైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని, అనంతరం 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని, 2005 నుంచి ఇప్పటి వరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని వివరించారు.

## మూడు నెలల్లోనే ఫ్లోటింగ్ వడ్డీ రేట్లు అమలు..!

**న్యూఢిల్లీ :** గృహ రుణ గ్రహీతలకు మరింత పారదర్శకత, వేగవంతమైన ప్రయోజనాలు అందించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కీలక విధివిధానాలను విడుదల చేసింది. దీని ప్రకారం.. ఆర్‌బిఐ వడ్డీ రేట్ల సవరణకు అనుగుణంగా బ్యాంకులు తమ ఫ్లోటింగ్ వడ్డీ రేట్లను మార్పులు చేసే సమయం గరిష్ఠంగా మూడు నెలలకు మించకూడదు. ప్రస్తుతం ఆర్‌బిఐ వడ్డీ రేట్లు తగ్గించినప్పటికీ, బ్యాంకులు ఆ ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు అందించడానికి ఏడాది వరకు సమయం తీసుకుంటుండటంతో ఈ కొత్త నిబంధనను తెస్తున్నారు. ఈ ప్రతిపాదనలపై సెప్టెంబర్ 11 వరకు వాటాదారుల అభిప్రాయాలను సేకరించనున్న ఆర్‌బిఐ.. 2025 ఏప్రిల్ 1 నుంచి దీనిని అమలు చేయనుంది. ఈ మార్పు కేవలం ఫ్లోటింగ్ రేట్ వర్తించే గృహ రుణాలకు మాత్రమే పరిమితమని, స్థిర వడ్డీ రేట్లు ఉండే వ్యక్తిగత, ఆటో రుణాలకు ఇది వర్తించదని నివేదిక పేర్కొంది.

## నాలుగు నూతన రైల్వే ప్రాజెక్ట్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ :** దేశంలో నాలుగు రైల్వే ప్రాజెక్ట్స్ కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడి అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు ఉంది. కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు, నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి అని పేర్కొంది. 2030-31 నాటికి ఈ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.



**ఎపికి రైల్వే ప్రాజెక్ట్‌లు :** ఆంధ్రప్రదేశ్‌లో గూడూరు-గుమ్మిడిపుండి మూడు, నాలుగో లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు-గుమ్మిడిపుండి మూడు, నాలుగో లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్-భద్రక్ నాలుగో లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్-హరిదాస్‌పూర్ నాలుగో లైన్‌కు రూ.1,583 కోట్లు, కటక్-పారాదీప్ మూడు, నాలుగో లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించారు. ఈ రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. అలాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్-సీతామర్హి-సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.

**హౌరా-చెన్నై మార్గానికి మరింత ప్రాధాన్యం**

హౌరా-చెన్నై రైల్వే మార్గం దేశంలోని అత్యంత కీలకమైన రైల్వే కారిడార్లలో ఒకటని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ మార్గం పూర్తిస్థాయిలో నాలుగు లైన్ల కారిడార్‌గా మారితే మరిన్ని రైళ్లను నడిపేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అదే సమయంలో సరుకు రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు రైల్వే ట్రాక్‌ల నిర్వహణ కూడా సులభతరం అవుతుందని వివరించారు. దేశంలోని ఏడు కీలక రైల్వే మార్గాల్లో హౌరా-చెన్నై కారిడార్ కూడా ఒకటని పేర్కొన్నారు.

## డిప్యూటీ ఛైర్మన్‌గా తుమాటి మాధవరావు ఏకగ్రీవం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌గా వైసిపి ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిప్యూటీ ఛైర్మన్ పదవికి మాధవరావు నుంచి మూడు సెట్ల నామినేషన్ దాఖలయ్యాయని ఛైర్మన్ కె మోషేను రాజు వెల్లడించారు. వరుదు కళ్యాణి, టి కల్పలత, ఎస్ మంగమ్మ ప్రతిపాదించిన నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం మాధవరావను ఛైర్మన్ స్థానంలోకి తీసుకురావాలని అన్ని పార్టీలను కోరారు. అయితే ఈ ఎన్నిక సమయంలో కూటమికి చెందిన మంత్రులు, ఎమ్మెల్సీలు సభలో నుంచి బయటకు వెళ్లిపోయారు. మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, వైసిపి ఎమ్మెల్సీలు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి, ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు.. మాధవరావును ఛైర్మన్ స్థానంలో కూర్చోబెట్టారు. అనంతరం సభ్యులందరూ తుమాటిని అభినందించారు. ఆ తార్వత మండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాబోయే కాలంలో అధికార, ప్రతిపక్ష పార్టీలను సమ దృష్టిలో చూడాలన్నారు. డిప్యూటీ ఛైర్మన్ ఎన్నిక సమయంలో అధికార పక్షం లేకపోవడం దురదృష్టకరమన్నారు. దేశంలో, రాష్ట్రంలో చట్టసభలు ఏర్పాటైన తరువాత ఇలాంటి పరిణామం జరగలేదన్నారు. నిబంధనలు, నియంత్రణలు గురించి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారని చెప్పారు. సభపై, కార్యక్రమాలపై ఎలాంటి గౌరవం ఉందో తెలుస్తుందని పేర్కొన్నారు. తోట త్రిమూర్తులు, లేళ్ల అప్పిరెడ్డి, రామసుబ్బారెడ్డి, కుంభా రవిబాబు, రామచంద్రారెడ్డి, సిపాయి సుబ్రహ్మణ్యం, బొమ్ము ఇజ్రాయిల్, అరుణ్‌కుమార్, సూర్యనారాయణరావు, దువ్వాడ శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, మురళీధర్, వంకా రవీంద్ర నాథ్, మురుగుడు హనుమంతరావు, వరుదు కళ్యాణి, కల్పలతా తదితరులు కూటమి తీరును తప్పుబట్టారు.



## ఫిన్‌లాండ్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుల పర్యటన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బడిలోనే పిల్లల భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది. ఉపాధ్యాయుల ప్రవర్తనే వారి ప్రగతికి బాటలు వేస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను అందించేందుకు ఒక వినూత్న అడుగు వేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా రంగంలో ప్రపంచ స్థాయి బోధనా పద్ధతులను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలను అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమాలకు పంపిస్తోంది.

ఇందులో భాగంగా, మొదటి విడతలో 2025 అవార్డు గ్రహీతలైన 37 మంది ఉపాధ్యాయులకు 2026 మే 4 నుంచి 8 వరకు సింగపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 5 రోజుల ప్రత్యేక శిక్షణ అందించగా, రెండో విడతలో 29 మంది ఉపాధ్యాయుల బృందాన్ని 2026 ఆగస్టు 17 నుంచి 26 వరకు ఫిన్‌లాండ్‌లోని టర్కు విశ్వవిద్యాలయ భాగస్వామ్యంతో 8 రోజుల వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమం కోసం పంపించింది. ఈ ప్రతినిధి బృందంలో మన అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికై అంతర్జాతీయ వేదికపై జిల్లా ఖ్యాతిని చాటడం విశేషం.



**స్థానిక పాఠశాలల్లో కొత్త ప్రణాళికలు :** అద్భుతమైన విద్యా సేవలకు ప్రసిద్ధి చెందిన దేశమైన ఫిన్‌లాండ్ విద్యా వ్యవస్థను అధ్యయనం చేయడానికి, రాష్ట్రానికి చెందిన ఉపాధ్యాయుల బృందం గత మూడు రోజులుగా ఆ దేశంలో పర్యటిస్తోంది. ముఖ్యంగా ఈ బృందంలో అల్లూరి జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. గత విద్యా సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 'ఉత్తమ ఉపాధ్యాయులు'గా గుర్తింపు పొందినందున, విద్యాశాఖ ఈ ఉపాధ్యాయులను విదేశీ పర్యటనకు ఎంపిక చేసింది. ఈ బృందం ఆ దేశంలో పిల్లల కోసం అనుసరిస్తున్న ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధనా పద్ధతులను, ఇతర విద్యా విధానాలను పరిశీలిస్తుంది.

విద్యార్థులు పాఠాలను మరింత సులభంగా గ్రహించడంలో సహాయపడటానికి పాఠశాలల్లో ఉపయోగించే, ప్రదర్శించే కిట్‌లను కూడా వారు పరిశీలిస్తారు. గతంలో కూడా ఉపాధ్యాయుల బృందం సింగపూర్‌ను సందర్శించిన విషయం గమనార్హం. ప్రస్తుతం ఈ పర్యటనలో ఉన్న ఉపాధ్యాయుడు సత్యరావు మాట్లాడుతూ, అక్కడ గమనించిన విజయవంతమైన పద్ధతులు, విద్యా వ్యవస్థలను స్థానిక పాఠశాలల్లో అమలు చేయడానికి విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు.

**అభినందనలు తెలిపిన నారా లోకేశ్ :** ఫిన్‌లాండ్ దేశ పర్యటనకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల బృందం సందర్శించిన నేపథ్యంలో నారా లోకేశ్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ విషయాన్ని స్వయంగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 29 మంది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఫిన్‌లాండ్‌లోని 'టర్కు విశ్వవిద్యాలయం'లో తమ విద్యా పర్యటనను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని నారా లోకేశ్? పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమంగా పేరొందిన ఫిన్‌లాండ్ విద్యా విధానాన్ని మన ఉపాధ్యాయులు రాబోయే రోజుల్లో ప్రత్యక్షంగా పరిశీలిస్తారని ఆయన చెప్పారు. ముఖ్యంగా పిల్లలు ఇష్టపడుతూ, ఆటపాటలతో నేర్చుకునే విధానాలు, బాలల కేంద్రీకృత బోధనా పద్ధతులు, అక్కడి క్లాస్‌రూమ్‌లలో ఉపయోగించే ఆధునిక పద్ధతులను వారు క్షుణ్ణంగా అధ్యయనం చేస్తారని వివరించారు.

అక్కడ నేర్చుకున్న వినూత్నమైన విషయాలను మన ఉపాధ్యాయులు తిరిగి వచ్చాక ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల వాతావరణానికి అనుగుణంగా మారుస్తారని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో కూడా సరికొత్త బోధనా పద్ధతులను అభివృద్ధి చేసి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిగిలిన తోటి ఉపాధ్యాయులకు వీరంతా మార్గదర్శకులుగా నిలుస్తారని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

## ఏలేరుకు జల'భరోసా'!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు సాగు, తాగు నీటి సరఫరా పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సూచనల మేరకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. బుధవారం అసెంబ్లీలో యల్లసిరి కెనాల్ పనులు, ఏలేరు జలాశయం పరిధిలోని ఆయకట్టుకు నీటి సరఫరాపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇచ్చారు. ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల సూచనలతో ఇటీవలే అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టామని మంత్రి తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు నీరందించాలనే ముందుచూపుతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంను నిర్మించారని పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో వంటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ 53 వేల ఎకరాల ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు, 1.48 లక్షల ఎకరాల పుష్కర ఆయకట్టుకు సాగు, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు.

గత ప్రభుత్వం ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు అందించే పోలవరం ఎడమ కాలువ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కనీసం తట్టమట్టి పని కూడా చేయలేదని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పోలవరం ఎడమ కాలువ పనులపై రూ. 1,800 కోట్లు ఖర్చు చేసి, అత్యంత క్లిష్టమైన పాంపా, తాండవ, ఏలేరు నదుల క్రాసింగ్ పనులతో పాటు 11 హైవే క్రాసింగ్ వంతెనల పనులను పూర్తి చేశామని తెలిపారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంతో పాటు పోలవరం ఎడమ కాలువ పనులను ముందుకు తీసుకెళ్లడం వల్లే ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగు నీరు అందించే పరిస్థితి ఏర్పడిందని మంత్రి స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో 548 గాడవీ పనులకు రూ. 25 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందని తెలిపారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఏలేరు ఆయకట్టుకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు మరో రూ. 15.84 కోట్లతో గాడవీ పనులకు ప్రతిపాదనలు పంపామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఏలేరు ఆయకట్టు రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు నిరంతరం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

## జానీమాస్టర్ పై నిషేధం కొనసాగుతుంది : ఫిలిం ఫెడరేషన్



**హైదరాబాద్ :** ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు గతంలో జానీ మాస్టర్ పై విధించిన నిషేధం కొనసాగుతుందని ఫిలిం ఫెడరేషన్ స్పష్టం చేసింది. బుధవారం నిర్వహించిన జనరల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఈ ప్రకటన చేసింది. ఈ సందర్భంగా డ్యాన్సర్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత తీరుపై కౌన్సిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సినీ పరిశ్రమ పెద్దలు, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, ఫెడరేషన్ సూచనలను ఖాతరు చేయకుండా డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు ఉప ఎన్నికలను నిర్వహించడాన్ని కౌన్సిల్ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో డ్యాన్సర్స్ ఫెడరేషన్‌కు ఫిలిం ఫెడరేషన్ సహకరించబోదని, డ్యాన్సర్లకు మాత్రం వ్యక్తిగతంగా సహకారం అందిస్తామని స్పష్టం చేసింది. పరిశ్రమలోని మిగిలిన 23 క్రాఫ్ట్స్‌కు ఎప్పటిలాగే సహకారం అందిస్తామని తెలిపింది. అంతేకాకుండా, గతంలో ఆయన ఫెడరేషన్‌కు అందజేసిన రూ. 3 లక్షల మొత్తాన్ని తిరిగి ఆయనకే వెనక్కి పంపుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ .... పరిశ్రమలో క్రమశిక్షణ, నిబంధనలను ఉల్లంఘించే చర్యలను ఏమాత్రం సహించేది లేదని తేల్చిచెప్పారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు తప్ప మిగిలిన 24 శాఖల (క్రాఫ్ట్స్) సంఘాలకు ఫెడరేషన్ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలోని కార్మికుల హక్కుల పరిరక్షణ తో పాటు నిబంధనలకు కట్టుబడి పనిచేసే యూనియన్లకే తమ సహకారం ఉంటుందని కౌన్సిల్ సభ్యులు ముక్తకంఠంతో వెల్లడించారు.

# ఉత్తమ సేవలకు గుర్తింపు..

- వాణి సక్కుబాయికి గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసా సన్మానం
- 'స్త్రీ శక్తి -సనాతన శక్తి' కార్యక్రమంలో ఘన సత్కారం
- మహిళా సాధికారత, విద్యాభ్యాసం, సర్వతోముఖ అభివృద్ధికి విశేష కృషి..

**హైదరాబాద్, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా సాధికారత, విద్యాభ్యాసం, సామాజిక చైతన్యం, సర్వతోముఖ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్న చేవెళ్ల ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయురాలు, దుర్గావాహిని తెలంగాణ ప్రాంత కన్వీనర్ శ్రీమతి వాణి సక్కుబాయికి అరుదైన గౌరవం లభించింది. ఆమె అందిస్తున్న సేవలను గుర్తిస్తూ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ప్రశంసా సన్మానం నిర్వహించారు. విశాఖ శారదా పీఠం శ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ, శ్రీశ్రీ స్వాత్మానందేంద్ర మహాస్వామీజీ వారి ఆధ్వర్యంలో 'స్త్రీ శక్తి - సనాతన శక్తి' పేరిట దివ్యమైన ఆధ్యాత్మిక, చైతన్య కార్యక్రమం లింగంపల్లి-చందానగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. మహిళా శక్తి, సనాతన సంప్రదాయాల గొప్పతనం, సమాజ నిర్మాణంలో మహిళల పాత్రపై ఈ కార్యక్రమంలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్ల మాట్లాడుతూ మహిళా శక్తి ప్రాధాన్యతను, భారతీయ సనాతన సంప్రదాయాల్లో మహిళలకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ మహిళా మూర్తులు ప్రసంగిస్తూ మహిళల్లో అంతర్లీనంగా ఉన్న శక్తిని జాగృతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళా సాధికారతతోనే కుటుంబం, సమాజం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. సనాతన సంస్కృతిలో మహిళకు ఉన్న గౌరవం, ప్రాధాన్యతను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. చేవెళ్ల ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయురాలు, దుర్గావాహిని తెలంగాణ ప్రాంత కన్వీనర్ వాణి సక్కుబాయి మహిళల విద్యాభ్యాసం, సాధికారత, సామాజిక చైతన్యం, సర్వతోముఖ అభివృద్ధి కోసం చేస్తున్న సేవలను గుర్తించి గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా ప్రశంసా సన్మానం నిర్వహించారు. మహిళలు విద్యావంతులై ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రోత్సహించడం, సమాజంలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేయడం, మహిళా శక్తిపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో ఆమె చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు.



మహిళా సాధికారత కోసం వాణి సక్కుబాయి చేస్తున్న సేవలు పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విశ్వవ్యాప్తంగా భారతీయ సనాతన సంప్రదాయాల్లో మహిళా శక్తికి ఉన్న విశిష్టతను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని కార్యక్రమంలో సందేశం ఇచ్చారు. మహిళను గౌరవించడం, ఆమె శక్తిని గుర్తించడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది ప్రముఖ మహిళలు హాజరై ఆధ్యాత్మిక, సామాజిక సందేశాలను ఆసక్తిగా విన్నారు. సనాతన స్త్రీ శక్తి గొప్పతనాన్ని, మహిళల బాధ్యతను, సమాజ అభివృద్ధిలో వారి పాత్రను తెలియజేసే విధంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికారతకు అంకితభావంతో సేవలందిస్తున్న వాణి సక్కుబాయిని గవర్నర్ చేతుల మీదుగా సన్మానించడం పట్ల చేవెళ్ల ప్రాంతానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు. ఈ గౌరవం మహిళా శక్తి కోసం మరింత సేవ చేయడానికి ప్రేరణనిస్తుందని వారు పేర్కొన్నారు.

# 22ఏ బాధితులకు తక్షణ ఉపశమనం కల్పించాలి

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్..

**యాదగిరిగుట్ట, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీలో 1977 పిఓటి అక్ట్, 22ఏ చట్టం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను బీజేపీ పట్టణ శాఖ నాయకులు మంగళవారం కలిశారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ.. 22ఏ సమస్యపై తాము గతంలోనే ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశామని తెలిపారు. అయితే అప్పట్లో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు పాలాభిషేకాలు చేసి, సమస్య పరిష్కారమైనట్లుగా ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. కానీ నేటికీ 22ఏ బాధితుల సమస్యలు పరిష్కారం కాలేదని ఆయన ఆరోపించారు. ఎంఆర్ఓ కార్యాలయానికి వెళ్లినా సమస్యలు పట్టించుకోవడం లేదని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరగడం లేదని అన్నారు. గతంలో ధరణి పేరుతో సామాన్య ప్రజలు,పెట్టుబడిదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు 22ఏ పేరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కర్రె ప్రవీణ్ ఆరోపించారు. 22ఏ పరిధిలో ఉన్న భూములు, ఆస్తుల విషయంలో ప్రజలకు స్పష్టమైన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 22ఏ సమస్యపై తీసుకున్న చర్యల తరహాలో తెలంగాణలో కూడా ప్రజలకు ఉపశమనం కల్పించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. 22ఏ బాధితుల భూములు, ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు వెంటనే చేపట్టి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నియోజకవర్గంలో పర్యటించి 22ఏ బాధితులకు భరోసా ఇచ్చారని గుర్తుచేసిన కర్రె ప్రవీణ్, ప్రస్తుతం బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా, రాజకీయ ప్రచారాలకు పరిమితం కాకుండా, 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల తరఫున మరింత పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు భువనగిరి శ్యాంసుందర్, బెల్లిదే అశోక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్ర మౌళి, పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్, పలుగుల సురేష్, ఉపాధ్యక్షులు ఆలేటి కర్ణ, మిర్యాల కృష్ణ, బీజేవైఎం పట్టణ నాయకులు బుచ్చిబాబు, దొమ్మాట నరేష్, ఆకుల దేవేందర్, వంశీ, శ్రీశైలం, బుదారం రమేష్, శ్యామ్, చందు, రంగసత్యం, శ్రీనాథ్ పాల్గొన్నారు.



# ఫ్లెక్సీల తొలగింపుపై బీఆర్ఎస్ ఆగ్రహం

## మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా..

- కాంగ్రెస్ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న మునిసిపల్ కమిషనర్
- పునరావృతమైతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక



**యాదగిరిగుట్ట, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించడంపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇటీవల గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 16న పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలు ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ ఫ్లెక్సీలను మాత్రమే తొలగించడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేపై అంత ప్రేమ ఉంటే ఆయన ఇంట్లో పని చేసుకోవాలని కమిషనర్‌పై బీఆర్ఎస్ నాయకులు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో కర్రె వెంకటయ్య, బట్టు సతీష్ రాజ్, ర్యాకల రాజు, చంద్రశేఖర్, పాపట్ల నరహరి, మిట్ట వెంకటయ్య, తోటకూరి బీరయ్య, కవిడే మహేందర్, కొన్యాల నరసింహారెడ్డి, సారాశి రాజేష్, గ్యాదపాక క్రాంతి తదితరులు ఉన్నారు.

# జీవో నెం. 97ను వెంటనే రద్దు చేయాలి

## పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను 'శక్తి స్కీమ్' కింద విలీనం చేయడం చారిత్రక తప్పిదం: సుర్వి మణికంట



**యాదగిరిగుట్ట, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో 70 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ యాదగిరిగుట్ట శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ విభాగ్ కన్వీనర్ సుర్వి మణికంట మాట్లాడుతూ.. ఐటీఐలు, ఏటీఐలు, లేబర్ డిపార్ట్‌మెంట్, పాలిటెక్నిక్ కళాశాలలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి'శక్తి' (యంగ్ ఇండియా) పరిధిలోకి తీసుకురావాలనే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యను 'శక్తి' పరిధిలో విలీనం చేయడానికి సంబంధించిన జీవో నెం. 97ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాలిటెక్నిక్ విద్య సాధారణ స్కిల్ ట్రైనింగ్ వ్యవస్థ కాదని, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నిపుణులను తయారు చేసే ప్రత్యేక సాంకేతిక విద్యా వ్యవస్థ అని అన్నారు. డిప్లొమా విద్యార్థులు జూనియర్ ఇంజనీర్లు, సైట్ సూపర్వైజర్లు, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది తదితర సాంకేతిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అందించే ప్రధాన వ్యవస్థ పాలిటెక్నిక్ కళాశాలలేనని పేర్కొన్నారు. డిప్లొమా అనంతరం ఉన్నత విద్యలోకి వెళ్లేందుకు లభించే లాటరల్ ఎంట్రీ వంటి అవకాశాలను బలోపేతం చేయాల్సినఅవసరంఉందన్నారు. పాలిటెక్నిక్‌లను నిర్వీర్యంచేయడం కాకుండా ల్యాబ్‌లు, మౌలిక వసతులు, బోధనా సిబ్బంది, ఆధునిక పరికరాలు, పరిశ్రమలతో అనుసంధానం మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీతో అవసరమైన చోట అవగాహన ఒప్పందాల ద్వారా కలిసి పనిచేసే విధానాన్ని రూపొందించవచ్చని సూచించారు. "పాలిటెక్నిక్ విద్య తెలంగాణలోని పేద విద్యార్థుల ఇంజనీరింగ్ కలలను సాకారం చేసే మార్గం. ఈ వ్యవస్థను బలహీనపరిస్తే వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. విద్యా వ్యవస్థలో ఇలాంటి కీలక మార్పులు తీసుకురావడానికి ముందు విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాలు, సాంకేతిక విద్యానిపుణులతో విస్తృతంగా చర్చించి, జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలి" డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఉప్పు సాయి కిరణ్, బండకింది అరవింద్, మేకల కిట్టు, లోకేష్, కార్యకర్తలతో పాటు పెద్దసంఖ్యలో పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలని ఆలోచనను ఉపసంహరించుకోవాలి
- పాలిటెక్నిక్ విద్య వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి
- శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్



**యాదగిరిగుట్ట, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన ను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కుమార్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అనే ఆయన పేర్కొన్నారు. దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గాని పేద విద్యా ర్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుం దినీ ఆయన అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యా శాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97ను ఉప సవరించుకోవాలన్నారు. రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉప సంఘం పచ్చ జెండా ఊపింది. కానీ ఆ తర్వాత కొత్తగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు ఐటీ పరిశ్రమలు శాఖ పరిధిలో నడుస్తున్న ఈ యూని వర్సిటీని సాంకేతిక విద్యా శాఖ పరిధిలోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినప్ప టికీ ఆ దిశగా ముందడుగు పడలేదు. తాజాగా ఐటిఐలు ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాల ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ నిర్వహించింది. దీంతో ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆటలాడుతుందని ఇలాంటి నిర్ణయాలను వెనుక తీసుకోవాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతే నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్ని కల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకులు భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీ కరణ దిశగా ప్రభుత్ ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని, లేనిఎడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, జిల్లా సహాయ కార్యదర్శి చిప్పల పల్లి నవీన్, యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కంబాల నరసింహ, విద్యార్థులు అశోక్, సాయి, విష్ణు, ఉదయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో వ్యాపార సముదాయాలపై

# మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- నిబంధనలను అతిక్రమిస్తే మున్సిపల్ చట్టాల ప్రకారం వారిపై తగిన చర్యలు
- సకాలంలో లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవాలి : మున్సిపల్ కమిషనర్ బర్ల శ్రీనివాస్



**యాదగిరిగుట్ట, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ బర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రేడ్ లైసెన్స్ సిబ్బంది మంగళవారం పట్టణంలోని పలు వ్యాపార సము దాయాలు, హోటళ్లు, దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వ్యాపార సంస్థ, దుకాణ యజమాని తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ట్రేడ్ లైసెన్స్ పొందిన వ్యాపారులు సకాలంలో లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే మున్సిపల్ చట్టాల ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. వ్యాపారులు మున్సిపల్ నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో సానిటరీ ఇన్స్పెక్టర్ సురేందర్, అంబేద్కర్, కొన్నే గణేష్ (ట్రేడ్ లైసెన్స్ కలెక్షన్) తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల పోరాటం ఆధారంగా వర్గీకరణ

- త్వరలోనే ఉద్యమకారుల గుర్తింపునకు చర్యలు
- చైర్మన్ డాక్టర్ కె. కేశవరావుతో కమిటీ సభ్యుల భేటీ..
- ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా, సంక్షేమ విధివిధానాలపై కీలక సమీక్ష



**హైదరాబాద్, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు నివాసంలో కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల అమరదీపం వేదికగా 16 రోజుల పాటు 13,000 మందికి పైగా ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన 'చర్చలపై ఒక ముసాయిదా నోట్' పై ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు. సేకరించిన క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం ఉద్యమకారులను క్రింది గ్రూపులుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది. మొదటి కేటగిరీ (అమరుల కుటుంబాలు): ఉద్యమ క్రమంలో అమరులైన వారు సుమారు 1400 మంది వరకు సమాచారం ఉండగా, గతంలో కొందరికి మాత్రమే సహాయం అందింది. మిగిలిన అర్హులైన అమరుల కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయడం. రెండవ కేటగిరీ (గాయపడిన ఉద్యమకారులు): పోలీసు కాల్పుల్లో, లాఠీచార్జీల్లో శాశ్వత అంగవైకల్యం పొందిన వారు మరియు ఆత్మహత్యా యత్నాల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు. మూడవ కేటగిరీ (జైలు జీవితం గడిపిన వారు): తొలిదశ (1969), మలిదశ ఉద్యమాల్లో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, తీవ్ర జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులు. నాల్గవ కేటగిరీ (కేసులు నమోదైన వారు): నాటి ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిలబుల్/నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న శ్రేణులు. ప్రత్యేక కేటగిరీలు (సంస్థాగత / క్రియాశీలక శ్రేణులు): కేసులు నమోదు కానప్పటికీ.. ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్-ధామ్ కళాకారులు మరియు వివిధ సంస్థల సభ్యులు. ఉద్యమకారులకు ఈ మూడు విధానాల్లో గౌరవం దక్కాలని కమిటీ స్పష్టం చేసింది. ఉద్యోగులు మరియు వసతి కలిగిన వారు కేవలం 'గుర్తింపు కార్డు / ప్రశంసా పత్రం' ఆశిస్తుండగా.. నిరుపేద, నిరుద్యోగ యువత 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు కోరుతున్నారు. జార్ఖండ్, ఉత్తరాఖండ్ తరహాలో సంక్షేమ పథకాలకు పూర్తి చట్టబద్ధత కల్పించడంతో పాటు శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్ష అనంతరం చైర్మన్ కేకే, కమిటీ సభ్యులు తదుపరి చేపట్టవలసిన చర్యలను ఖరారు చేశారు. ఉద్యమకారులు దరఖాస్తు చేసుకోవడానికి త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ / పోర్టల్ ద్వారా అవకాశం కల్పిస్తారు. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు నమూనాను సిద్ధం చేయడం జరుగుతుంది. శాసనసభ్యులు , శాసనమండలి సభ్యులతో విస్తృత స్థాయి చర్చలు జరపడం. మిగిలి ఉన్న ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులతో సంభాషణలు పూర్తి చేయడం. ఇప్పటివరకు జరిగిన అన్ని చర్చల సమగ్ర నివేదికను, మినిట్స్‌ను రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించాలని నిర్ణయించారు.

# ఉరిశిక్షను రద్దు చేయండి

- ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి - సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీం కోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈఅంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టుతనతీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈవిధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారామరణశిక్షను అమలు చేసేవారు.అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్షఅమలులో భాగంగాఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలుచేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్‌ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈఅంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆన్యాయవాది కోరారు.

# దేవరకద్ర మండల రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

- రైతులకు ట్రాన్ఫార్మర్లు పంపిణీ చేసిన దేవరకద్ర శాసన సభ్యులు జీఎమ్ఆర్
- ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం...
- రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ మరియు సాగు నీటి వసతుల కల్పనతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాము
- కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం తమది రైతు సంక్షేమ, రైతు పక్షపాత ప్రభుత్వం..





దేవరకద్ర ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద దేవరకద్ర మున్సిపాలిటీ ఢ మండలం కు చెందిన రైతులకు వ్యవసాయ అవసరాల నిమిత్తం 40 ట్రాన్ఫార్మర్లు మరియు ఏబి స్విచ్ లు, వైర్లు, పోల్స్ పంపిణీ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి. కార్యక్రమంలో ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ మరియు సాగు నీటి వసతుల కల్పనతో వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ రైతన్నలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

ప్రధాన వ్యవసాయ సంక్షేమ పథకాలు రైతు భరోసా వానాకాలం సాగుకోసం రైతుల ఖాతాలలో పెట్టుబడి సాయం జమ చేయడం.రుణమాఫీతో అర్హులైన రైతుల రుణాలను దశలవారీగా మాఫీ చేయడం.సన్న వడ్ల బోనస్ ద్వారా రైతులకు మద్దతు ధరతో పాటు అదనంగా బోనస్ అందజేత. సాగు నీరును ఎత్తిపోతల పథ కాలు, ప్రాజెక్టుల ద్వారా నిరంతరం నీటి సరఫరా చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తమది రైతు సంక్షేమ, రైతు పక్షపాత ప్రభుత్వమని అన్నదాతల అభివృద్ధికి, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే జిమ్మెర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం చేపట్టిన ప్రధాన హామీలు మరియు అమలు చేస్తున్న పథకాలు,ప్రధానంగా రైతు సంక్షేమ చర్యలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయలేదు.ధాన్యం కొనుగోలు , మద్దతు ధర ద్వారా పంటలకు మద్దతు ధర కల్పిస్తూ సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం.వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చడం, రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీలు, మరియు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే జీఎమ్ఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు అంతంత మాత్రంగానే ఉండ టంతో పలువురు రైతులు బోర్లపై ఆధారపడి వ్యవసాయం కొనసాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దేవరకద్ర నియోజకవర్గానికి సుమారు 800 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరగా ప్రభుత్వం వెంటనే స్పందించి 800 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా దేవరకద్ర మండలానికి మొదటి విడతలో 40 ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందజేస్తున్నామని, మరో పది రోజుల్లో మరో 60 ట్రాన్స్‌ఫార్మర్లను అందజేస్తామని తెలియ జేశారు. ట్రాన్ఫార్మర్ల పంపిణీకి సంబంధించి నియోజక వర్గంలోని ప్రతి మండలంలో కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు అందజేస్తామని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు వైర్లు, ఏబీ స్విచ్ లు, పోల్స్ తదితర అవసరమైన విద్యుత్ సామగ్రిని రైతులకు అందిస్తు న్నామని తెలిపారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో రైతుల అవసరాల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు 13 సబ్‌స్టేషన్ లకు శంకుస్థాపన చేసామని, దానికి సంబంధించిన పనులు శర వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి సంవత్సరంలోనే 500 ట్రాన్స్‌ఫార్మర్లను దేవరకద్ర నియోజకవర్గ రైతులకు అందజేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్ర మంలో ప్రజా ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రతిష్టించిన పెద్ది విగ్రహాన్ని తొలగించిన మున్సిపాలిటీ, పోలీస్, రెవిన్యూ అధికారులు

- అర్ధరాత్రి అరాచకత్వం.....
- ధర్నాలు రాస్తారోకోలతో దద్దరిల్లి నర్సంపేట డివిజన్.....
- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శవయాత్రలు, దిష్టిబొమ్మ దహనాలు....
- అడుగడుగునా పోలీసుల పహారా భగ్గుమంటున్న బీఆర్ఎస్ నాయకులు





నర్సంపేట, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అర్ధరాత్రి పోలీసులు అరాచకత్వం సృష్టించి విగ్రహంతో పాటు గద్దెను కూల్చి ఆనవాలు సైతం లేకుండా చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గత నెల 31వ తేదీన అనారోగ్యంతో మరణించడంతో జననీరాజలనాల నడుమ ప్రభుత్వ అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు మంత్రులు మాజీ మంత్రులు పెద్ది సుదర్శన్ రెడ్డి నల్లబెల్లికి విచ్చేసి ఘనంగా నివాళులర్పించారు. ఇప్పటివరకు బాగానే ఉండగా నర్సంపేట పట్టణాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీని నర్సంపేటకు తెప్పించుటలో పేరుగాంచిన పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని స్థానిక మెడికల్ కాలేజీ ముందు ప్రైవేట్ ల్యాండ్ లో ఆయన దశదిన కర్మ రోజే అత్యంత చాకచక్యంగా పోలీసులతో జరిగిన వాదనల అనంతరం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రతిష్టించారు. అంతకుముందే విగ్రహ ప్రతిష్ట కోసం గద్దెను నిర్మిస్తున్న క్రమంలో మున్సిపాలిటీ అధికారులు నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడంతో బి ఆర్ ఎస్ నాయకులు కోపోద్రిక్తులై గద్దెను నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. నాటినుండి ఇప్పటివరకు పెద్ది సుదర్శన విగ్రహం వద్ద గట్టి బందోబస్తు నిర్వహించిన పోలీసులు సోమవారం అర్ధరాత్రి వందలాది మంది పోలీసుల సమక్షంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం విగ్రహంతో పాటు గద్దెను నిర్మించడానికి అక్కడ లేకుండా పట్టుకెళ్ళారు. ఓ పక్క విగ్రహం కూల్చుతూనే మరోపక్క నర్సంపేట డివిజన్ బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాజీ ఎమ్మెల్యేలను ప్రముఖ నాయకులను గృహ నిర్బంధం చేసి కొంతమందిని ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించి పోలీసులు ఓవరాక్షన్ చూపించారు. దీంతో అర్ధరాత్రి జరిగిన అరాచకత్వాన్ని గమనించిన టిఆర్ఎస్ నాయకులు ఉద్యమకారులు ఉదయం నుంచి ధర్నాలు రాస్తారోకోలు చేపట్టడం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం శవయాత్రలు నిర్వహించడం చేపట్టారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎక్కడికక్కడ బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి ఇతర జిల్లాల పోలీస్ స్టేషన్లో తరలించి శాంతి భద్రతలకు విగాతం కలగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. మరోపక్క నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో పోలీసులు అప్రమత్తమై వ్యవహారాన్ని పోలీసులు చేతుల్లోకి తీసుకున్నారు.

**జిల్లా కలెక్టర్, సిపి లే బాధ్యత వహించాలి**

**- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్**

నర్సంపేట డివిజన్ కేంద్రంలో జరిగిన పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ తొలగింపు కార్యక్రమంలో 1500 మంది పోలీసులు పాల్గొన్నారు ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యాన్ని కూనిచేయడ మేనని దీనికి పూర్తి బాధ్యత జిల్లా కలెక్టర్ తో పాటు సిపి వహించాల్సి వస్తుందని హనుమకొండ మాజీ ఎంపీ బీఆర్ఎస్ ప్రముఖ రాష్ట్ర నాయకుడు బోయినపల్లి వినోద్ కుమార్ హెచ్చరించారు. హౌస్ అరెస్టు అయిన వినోద్ కుమార్ మాట్లాడుతూ నర్సంపేటలో విగ్రహాలు స్తూపాలు ఉన్నాయని పర్మిషన్ లేకుండా ఉన్న విగ్రహాలపై ఫిర్యాదు చేస్తే వాటిని తొలగించే దమ్ము ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి హత్య రాజకీయాలకు వెళ్లకుండా శాంతియుత పరిష్కార మార్గాలు చేపట్టి డివిజన్ ప్రజలకు ఎలాంటి టెన్షన్ లేకుండా చేశారని దానికి భిన్నంగా ఇప్పుడున్న ఎమ్మెల్యే గతంలో ముఖ్యమంత్రి అయ్యాక సైతం నర్సంపేట నియోజకవర్గంలో రేవంత్ రెడ్డిని అడుగు పెట్టనీయని అరాచకత్వం ఉందని ఆయన గుర్తు చేశారు. నర్సంపేటలో ఎలాంటి దుర్ఘటనలు జరిగిన బాధ్యత అధికారులు లేనని ఆయన పేర్కొన్నారు.

**ఉద్యమకారుడిని అవమానించడం తగదు**

**- మాజీ ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్ రెడ్డి**

నర్సంపేటలో నరమేధం కొనసాగుతుందని ప్రైవేటు ల్యాండ్ లో విగ్రహం పెడితే అధికారులకు ఎందుకు తొలగించాల్సిన పరిస్థితులు దాపిరించాయని వీటన్నింటికీ పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీ అధికారులు దేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో పేర్ ఎన్నికైన ఉద్యమకారుల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి స్థానంలో ఉంటాడని అలాంటి సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడం ప్రజాస్వామ్యమని శ్రీనివాస్ రెడ్డి వాపోయాడు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

**- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి**



గద్వాల, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ధరూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గద్వాల నియోజకవర్గంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. గ్రామాల్లో ముందుగా పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో సర్పంచులు చేపట్టిన వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు గ్రామాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే విధంగా ప్రస్తుత సర్పంచులు తమ పదవీకాలంలో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, మహిళా భవనాలు, వ్యవసాయ గోదాములు తదితర మౌలిక వసతులను కల్పిస్తే ఆయా అభివృద్ధి పనులు వారి పదవీకాలానికి గుర్తుగా నిలిచి పోతాయని అన్నారు.సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని అన్నారు. గ్రామంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసినప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. కార్యక్రమం ఇన్‌చార్జి సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోం దన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రణాళికాబద్ధంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటి అమలు విధానంపై సదస్సులో వివరిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా సీనియర్ నాయకుడు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు రాధాకృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, జెడ్పీ సీఈవో, ఎంపీడీవోలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గాజులపేట గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీ

- రికార్డుల నిర్వహణలో లోపాలు
- నిధుల దుర్వినియోగం గుర్తింపు
- పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశం.
- ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరి
- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు





దేవరకద్ర, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : దేవరకద్ర నియోజకవర్గం ,గాజులపేట గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాల యంలోని రికార్డులను పరిశీలించిన కలెక్టర్, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండానే నిధులు వినియోగిం చినట్లు గుర్తించారు. అలాగే, పంచాయతీ కార్యదర్శి చూపించిన కొన్ని తీర్మానాలు నకిలీవిగా ఉన్నట్లు పరిశీలనలో తేలింది. రికార్డుల నిర్వహణకు సంబంధించిన పత్రాలు కూడా సక్రమంగా లేవని కలెక్టర్ గుర్తించారు. దీంతో గాజులపేట పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దోమల నివారణ కోసం వినియోగించే ఫాగింగ్ మిషన్ల వివరాలు, వాటి సంఖ్య, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను కూడా ఆమె పరిశీలించారు. అనంతరం గాజులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం 10వ తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రస్తుతం ఏ పాఠ్యాంశం జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బయాలజీ చదువుతున్నామని తెలపగా, చదువు ఎలా సాగుతోంది, ఉపాధ్యాయులు పాఠాలను బాగా బోధిస్తున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యమైన విద్య అందించాలని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ధీరుడు

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**- జీఎమ్ఆర్ దేవరకద్ర శాసన సభ్యులు...**



దేవరకద్ర, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా దేవరకద్ర నియోజక వర్గ శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి ,ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆ యోధుడికి ఘనంగా నివాళులర్పించారు. అన్యా యాన్ని ఎదిరించి, సమానత్వం కోసం పోరాడిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. సర్వాయి పాపన్న గారు చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## కాకతీయ కళాతోరణాన్ని ఫ్లెక్సీలతో కప్పివేయడం దారుణం

**- అధికారుల నిర్లక్ష్యంపై బీజేపీ ఆగ్రహం**



నర్సంపేట, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు సిటీ సెంటర్‌లో కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచే కాకతీయ కళాతోరణం కనపడ కుండా రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు కట్టడం శోచనీయమని వరంగల్ జిల్లా బీజేపీ ప్రచార కార్యదర్శి బాల్నే జగన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తోరణం ప్రాధాన్యతను దెబ్బతీస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటే అధి కారులు ఏం చేస్తున్నారని, దీనికి ఎవరు అనుమతి ఇచ్చారో సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. చారిత్రక వారసత్వ సంపదను రాజకీయ ప్రచారాలకు ధ్వజంగా మార్చడం సరికాదని విమర్శించారు.వెంటనే స్పందించి కళాతోరణంపై ఉన్న రాజకీయ ఫ్లెక్సీలను తొలగించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు, పురపాలక వర్గాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**- తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతంగౌడ్.**



పర్వతగిరి, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : పర్వతగిరి మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతిని తెలంగాణ గౌడ సంఘం పర్వతగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి పండ్లు పంపిణీ చేసిన తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతంగౌడ్. ఈ కార్యక్రమంలో పర్వతగిరి పాక్స్ సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం మండల అధ్యక్షులు రంగు జనార్దన్ గౌడ్, బీ.ఆర్.ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు రంగు కుమారస్వామి గౌడ్, పర్వతగిరి గౌడ సొసైటీ అధ్యక్షులు పుల్లూరు సారయ్య గౌడ్, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మెరుగు వెంకటేశ్వర్లు గౌడ్, గౌడ పెద్దలు చింతల శ్రీనివాస్ గౌడ్, పూజారి రామలింగం గౌడ్, బూర శ్యామ్ గౌడ్, బాల్య వెంకటరాజు గౌడ్, ఊరుకొండ కుమార్ స్వామి గౌడ్, రంగు వెంకన్న గౌడ్, రెడ్లవాడ గ్రామ మాజీ సర్పంచ్ రావుల ప్రసాద్ గౌడ్, దొనికన రాజు గౌడు, దొమ్మటి రవి గౌడ్, దొమ్మటి రాజు గౌడ్, కత్తి ఉప్పలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన

## పాపన్న గౌడ్ స్ఫూర్తిదాయకం

**- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మొగలులు, గోల్కొండ నవాబుల పాలనను ఎదిరించిన గొప్ప వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. కేవలం వీరయోధుడిగానే కాకుండా సామాజిక న్యాయం కోసం పోరాడిన సంఘ సంస్కర్తగా పాపన్న గౌడ్ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన త్యాగం, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగించిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని కలెక్టర్ పేర్కొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ... మొగల్ రాజుల దురాగతాలు, నిజాం పాలనకు వ్యతిరేకంగా అచంచల ధైర్యసాహసాలతో పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. సమానత్వం, ఆత్మగౌరవానికి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలుస్తారని అన్నారు. ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించుకోవడం ప్రతి తరానికి గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్ రెడ్డి, గణపతి రెడ్డి, లింగాచారి, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) : పేద ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల ప్రజాపాలనలో సాకారమవుతోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గట్టు మండలం మాచర్ల గ్రామానికి చెందిన సుజాని భర్త తిప్పయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తికావడంతో మంగళవారం ఎమ్మెల్యే నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఇంటిని ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. ఇళ్లు మంజూరు కాని అర్హులైన వారికి రెండో విడతలో ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుక అందజేశారు. కార్యక్రమంలో రమేష్ నాయుడు, రాజశేఖర్, విజయ్, సిద్ధ రామప్ప, ఆలీ సురేష్, శ్రీనివాసరెడ్డి, రాజా గౌడ్, నర్సింహులు, మహబూబ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు

# పారదర్శకంగా చేపట్టాలి:డీఆర్వో కె. మల్లికార్జునుడు

**కడప, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
స్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామపంచా యతీ ల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లి కార్జునుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్ లో జిల్లా.కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత పై జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డీపీవో రామచంద్ర, మున్సిపల్ కమీషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులతో డిఆర్వో మల్లికా ర్జునుడు సమావేశం నిర్వహిం చారు. జిల్లాలో గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచు కుని త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను చక్క టి ప్రణాళికతో నిర్వహిం చేందు కు సన్నద్ధం కావాలన్నారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఇంటింటి సర్వే ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించి, 21, 22 తేదీల్లో ఓటర్ల జాబితాల్లో గుర్తించనున్నారు. 23న ముసాయిదా జాబితా ప్రచురించి, 24 నుంచి 26 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 27 నుంచి 31 వరకు అభ్యంతరా లపై విచారణ నిర్వహించి, సెప్టెంబరు 1 నుంచి 4 వరకు గ్రామసభల్లో జాబితాలను ధ్రువీ కరిస్తారని, అలాగే.. సెప్టెంబ రు 5న తుది జాబితాను ప్రచురిస్తారన్నారు.



# నూతన అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి వినతి



**కడప, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
నగరంలోని వైజంక్షన్ వద్ద శిధిలావస్థకు చేరుకున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవ నాన్ని వెంటనే తొలగించి, అదే స్థలంలో ఆధునిక సౌకర్యాలతో నూతన అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని కోరుతూ కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి కి అంబేద్కర్ భవన్ పరిరక్షణ వేదిక ఆధ్వ ర్యంలో మంగళవారం ఎంపీ క్యాంపు కార్యాలయం నందు వినతిపత్రం ఇచ్చారు.ఈ సంద ర్భంగా ఆ వేదిక నాయకులు జాల జయవర్ధన్, సగిలి గు రప్ప,కన్నెలూరు శంకర్, అంజి, గోపి లు మాట్లాడుతూరాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరుతో నిర్మించబడిన కడప నగరంలోని వై జంక్షన్ వద్ద ఉన్న అంబేద్కర్ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలా వస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశా రు. వేలాది మంది విద్యార్థు లు, యువత, సామాజిక సంఘాల ప్రతినిధులు, ప్రజలు వినియోగిం చే ఈ భవనం నిర్వహణ విష యంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

# రోబోటిక్ సర్జరీతో మోకాళ్ల మార్పిడి సులభతరం

**జగిత్యాల, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఆధునిక వైద్య విధానాల్లో రోబోటిక్ సర్జరీ ఎంతో విజయవంతమైన విధానమని, దీని ద్వారా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సను మరింత ఖచ్చితత్వంతో నిర్వహించవచ్చని హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ దాచేపల్లి సునీల్ అన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో నిన్న సోమాజిగూడ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో మోకాళ్ల మార్పిడి, రోబోటిక్ సర్జరీ ప్రయోజనాలపై రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సునీల్ మాట్లాడారు. మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్స అనంతరం చాలామందికి నొప్పి నుంచి ఉపశమనం లభించడంతో పాటు సాధారణ జీవితం గడుపుతూ తమ పనులను తామే చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 30 లక్షలకు పైగా మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని వివరించారు. సరైన సమయంలో మోకాళ్ల మార్పిడి చేయించుకుంటే 20 నుంచి 25 సంవత్సరాల వరకు మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.
అనవసరమైన ఖర్చుల కంటే ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆధునిక వైద్య సాంకేతికతపై ఖర్చు చేయడం ప్రయోజనకరమన్నారు.సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో ప్రతిరోజూ మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
మోకాళ్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే కొంతమంది క్రమంగా నడవలేని స్థితికి చేరుకుని మంచానికే పరిమితమయ్యే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఆధునిక రోబోటిక్ విధానంతో చికిత్స అందించడం ద్వారా శస్త్రచికిత్సలో ఖచ్చితత్వాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ సుధీర్ కుమార్, మేనేజర్ హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# మోరపల్లిలో జెడ్పీహెచ్ఎస్‌లో వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభం



**జగిత్యాల, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
మోరపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్‌ను గ్రామ సర్పంచ్ కట్ట రాజేందర్ ప్రారంభించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శితో కలిసి ఆయన ప్యూరిఫైయర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ తరఫున వాటర్ ప్యూరిఫైయర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాలకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.పాఠశాలలో శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యాన్ని కల్పించిన గ్రామ పంచాయతీ పాలకవర్గానికి, సర్పంచ్ కట్ట రాజేందర్‌కు పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



# పెగడపల్లి లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుక

**పెగడపల్లి, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద మండల గౌడ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని గౌడ కుల సభ్యుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ క్షేత్రీయుడే కత్తి పట్టాలన్న సూత్రాన్ని మార్చిన మహాయోధుడు బహుజన విప్లవ వీరుడు, గోల్కొండ మహారాజ్, అణగారిన వర్గాల అభ్యున్నతికి వీరోచిత పోరాటం చేసిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ , గౌడ సంఘం యువజన విభాగం అధ్యక్షులు నాగుల రాజశేఖర్ గౌడ్, మండల వివిధ పార్టీల అధ్యక్షులు కడారి తిరుపతి,లోకమల్లారెడ్డి, ముంజ మధుకర్ గౌడ్, చంద్రశేఖర్, గంగాధర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బొమ్మెన స్వామి, ఆనందం, నరేందర్ రెడ్డి, సాయిని రవీందర్, ప్రభాకర్ గౌడ్, తిరుపతి నాయక్, రహీం, శ్రీనివాస్ గౌడ్, కర్ణాకర్ రెడ్డి, ఎలకటూరి రవి, రమేష్ నాయక్, అజయ్, బాలసాని కిషన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మొండయ్య గౌడ్, లచ్చ గౌడ్, మల్లేశం గౌడ్, శ్రీను గౌడ్, రాజు గౌడ్, భాస్కర్ గౌడ్, శంకర్ గౌడ్, రవి గౌడ్,బాబు, ఎల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీడీవో కు వినతి పత్రం సమర్పించిన గ్రామపంచాయతీ కార్మికులు



**పెగడపల్లి, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల అభివృద్ధి అధికారి ప్రేమ్ సాగర్ కు గ్రామ పంచాయతీల కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించాలని, పారిశు ద్ధ కార్మికులు ఏళ్ల తరబడి పనిచేసిన పనికి భద్రత, పర్మినెంట్ కనీస వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ ప్రభుత్వ బీమా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికులందరికీ పర్మనెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినప్పటికీ అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడిచిన పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించడం లేదని అన్నారు. అక్రమంగా సిబ్బందిని తొలగిస్తున్న సర్పంచుల పైన ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇంటి స్థలం కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతుల రవి బొమ్మెన నరసయ్య శంకర్ చంద్రయ్య, అంజయ్య, లచ్చయ్య, జోగమ్మ,వివిధ గ్రామ పంచాయతీల కార్మికలు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండవద్దు: డీఎంహెచ్ఓ

**తాండూర్, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** దోమల వల్ల వచ్చే వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్ సూచించారు. మంగళవారం తాండూర్ మండలం మాదారం త్రీంక్లైన్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ చందనాల రవితో కలిసి ఆయన ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికి దోమల మందు పిచికారీ చేయించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామ ప్రజలు దోమల నివారణ చర్యల్లో భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, వార్డు మెంబర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



**తాండూర్, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మంగళవారం తాండూర్ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో వీర యోధుడు, బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం, ధైర్య సాహసాలు, ప్రజల కోసం చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని, గౌడ సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు పురుషోత్తం గౌడ్, శంకర్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మనోహర్ గౌడ్, రవి గౌడ్, మొండి గౌడ్, కిష్ట గౌడ్, సుధీర్ గౌడ్, భాస్కర్ గౌడ్, మహీధర్ గౌడ్, పున్నం గౌడ్, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, పలువురు సర్పంచ్లు, గౌడ సంఘం నాయకులు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్టీటీఎస్ సభ్యత్వ తీసుకోవాలి



**తాండూర్, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
మండలంలోని వివిధ పాఠశాలల్లో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఎస్టీయూటీఎస్ సభ్యత్వాన్ని స్వీకరించారు. జిల్లా అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 80 సంవత్సరాలుగా ఎస్టీయూటీఎస్ విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తుందని తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేసి ఉపాధ్యాయ సమస్యలపై మరింత పోరాటం చేసేందుకు అందరూ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల ఈఎల్ లు, చైల్డ్ కేర్ లీవులు, సర్వీస్ సంబంధిత పనులు, ప్రొసీడింగ్‌లను ఎంఈఓ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆలస్యం చేయకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని, పిఆర్సీ నివేదిక తెప్పించి అమలు చేయాలని, జీపీఎఫ్, సీపీఎస్,ఈఎల్ బిల్లులను విడుదల చేయాలని, సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవితారత్నం, ఎండీ ఇఫ్లికర్, డీ రామయ్య, గజియా ఫిర్దోస్, సాబీర్, నూజత్ కాతూన్, శ్రీనివాస్, పద్మ, సీహెచ్.ప్రవీణ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్‌లో డిజిటల్ వ్యవసాయంపై రైతులకు శిక్షణ



**తాండూర్, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను రైతులకు చేరువ చేసేందుకు తాండూర్ మండలం కిష్టంపేట రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో ఆర్.పి.ఎల్ ఆధారిత నైపుణ్యా అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో 30 మంది రైతులకు డిజిటల్ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పురుగు-తెగుళ్ల ఉధృతి, మార్కెట్ ధరలు, ప్రభుత్వ సేవలు, పంట నిర్వహణకు సంబంధించిన సలహాలను మొబైల్ అప్లికేషన్ల ద్వారా తెలుసుకునే విధానాన్ని నిపుణులు వివరించారు. శాస్త్రీయ పద్ధతులతో, డిజిటల్ సాధనాల ద్వారా వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజానరేందర్, మండల వ్యవసాయ అధికారి సుష్మ, ఉద్యానవన అధికారిని అర్చన, వ్యవసాయ విస్తరణ అధికారులు రాకేష్, వెంకటేష్, మౌనిక తో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 19న తాండూర్ బంద్‌కు పిలుపు



**తాండూర్, ఆగస్టు 19 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఏజెన్సీ ప్రాంతంలో పోలీస్ ఉద్యోగాల్లో 75% రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆగస్టు 19న తాండూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ యువతకు 75% ఉద్యోగాలు కేటాయించాలని వారు కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాల్లో న్యాయం చేయాలని, స్థానిక హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయాలని మండల ప్రజలకు, వ్యాపార సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షులు యపాల సమ్మయ్య, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం మణికుమార్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి అరికిల శంకర్, మండల ప్రధాన కార్యదర్శి బుర్స ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు గావుడే మల్లేష్, కొలవార్ సంఘం మండల అధ్యక్షులు గొలిశెట్టి బాపు, మండల నాయకులు ఊరడి వెంకటేష్, బోగారపు ప్రశాంత్, ఎడ్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం: బీసీ నేతలు



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): జై బీసీ అనేది నినాదం కాదని తెలుగుదేశంపార్టీ విధానమని పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు ఫణిదపు దుర్గ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించిన సందర్భంగా బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బీసీ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, శాసన మండలి సభ్యులు, తెనాలి టిడిపి ఇంచార్జ్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఫణిదపు దుర్గ మాట్లాడుతూ మొదటి నుండి బీసీ లకు వెన్నుదన్నుగా ఉంది తెలుగుదేశంపార్టీ అని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలను తెలిపారు. రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఉన్న 27 శాతం నుండి 24 శాతానికి కుదించి కపట నాటకం ఆడిందని గుర్తు చేశారు. రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి పరుచూరి రమ్య మాట్లాడుతూ మొన్నటికి మొన్న మహిళా రిజర్వేషన్ పెంచి మహిళల మన్నలను పొందిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు బీసీల పక్షమే కూటమి ప్రభుత్వం అని నిరూపించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, వసంతం అశోక వర్ధన, పసుపులేటి త్రిమూర్తి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు గిరి గణేష్, సీనియర్ నాయకులు తాడిబోయిన శ్రీనివాసరావు, దివి అనిత, మైత్రా శ్రీరామ మూర్తి, జయరాం, అన్నం పిన్నారావు, బ్రహ్మేశ్వర రావు, చాట్రగడ్డ ఆంజనేయులు, పోతురాజు, సుభాని, కృపేన, నరసింహ , సుభాష్ శ్రీరామ్, దివి సత్యనారయణ, హైమారావు, రాజేష్ భాగ్యరాజు, దేవినేని రమాదేవి, చైతన్య, మహేష్, పినపాటి రవీంద్ర, ఎన్టీఆర్ జగన్ , షావుల్ సయ్యద్, అలసి పూర్ణ, రమాదేవి, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

## అనవసర నిరాధార ఆరోపణలు తగదు



- రాజకీయ కక్షతోనే మాపై దాడులు:ముద్దుకృష్ణమ నాయుడు
- తప్పు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో వారసత్వ భూముల విషయంలో జరుగుతున్న ఆరోపణలను కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన ముద్దుకృష్ణమ నాయుడు తీవ్రంగా ఖండించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దిరసవంచ రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం. 818, 819 భూమి తమ పూర్వీకులకు సంబంధించినదని తెలిపారు. గత నాలుగు తరాలుగా ఆ భూమిలో తమ కుటుంబ సభ్యుల భౌతిక కాయాలను ఖననం చేసి సమాధులు నిర్మించుకున్నామన్నారు. 2019 నుంచి వైసీపీ నేతలు రాజకీయ కక్షతో తమ స్వాధీనంలో ఉన్న భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. అప్పుడు అడ్డుకునేందుకు వెళ్లగా తనపైనే దాడి చేసి హత్యాయత్నం కేసు పెట్టారని, తమ అన్న సమాధిని ధ్వంసం చేశారని చెప్పారు. ఇప్పుడు మళ్లీ దౌర్జన్యంగా చెట్లు పీకివేసి, భూమిని చదును చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలు ఉంటే చూపించండి. రాజకీయంగా దెబ్బతీయడానికి ఇలాంటి చిల్లర వేషాలు తగవు. తప్పు చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం" అని ముద్దుకృష్ణమ నాయుడు హెచ్చరించారు. మాదాల సుబ్బయ్య, కొమ్మినేని మాధవ, కొమ్మినేని బాలయ్య, సుభాష్ చంద్ర తదితరులు రాజకీయ కక్షతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబర్లలో తప్పుడు వివరాలు నమోదు చేసి ఆర్ఎస్ఆర్ ట్యాంపరింగ్ చేసినట్లు వారిపై ఆరోపణలు చేశారు. మేము చదువుకున్న వాళ్లం. చట్టాన్ని గౌరవిస్తాం. గ్రామంలో ప్రశాంతత కావాలంటే ఎవరికి హక్కు ఉంటే వారికే చట్టప్రకారం దక్కుతుంది" అని స్పష్టం చేశారు. కొమ్మినేని బాలయ్య చేసిన ఆరోపణలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## యువత భవితకు పట్టిన చీడ జగన్ : ఎమ్మెల్యే నసీర్

- వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ పరీక్షల్లో అక్రమాలు తేటతెల్లం
- సిట్ చివాట్లు పెట్టినా బుద్ధి రాలేదు
- విద్యార్థులపై జగన్ కు తీరు దారుణం
- డీఎస్సీపై జగన్ విమర్శలు సిగ్గుచేటు



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):ఏపీపీఎస్సీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన జగన్ యువత భవితకు పట్టిన చీడ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ పత్రిక ప్రకటనలో చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించిన గ్రూప్ -1 పరీక్షల్లో అన్నీ అవకతవకలేనని, దీనిపై విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక వాస్తవాలు తేటతెల్లమయ్యాయని తెలిపారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంపై ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేసిందన్నారు. ఇటీవల సిట్ హైకోర్టుకు సమర్పించిన తుది నివేదికలో తీవ్ర ఉల్లంఘనలు వెలుగుచూశాయని తెలిపారు. జవాబు పత్రాల డిజిటల్ మూల్యాంకన ప్రక్రియలో నిబంధనలను పక్కనపెట్టి, బార్‌కోడ్‌లను తారుమారు చేశారని మండిపడ్డారు. అర్హత లేని అభ్యర్థులకు ఎక్కువ మార్కులు కేటాయించారని, ఇది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనని చెప్పారు. మూల్యాంకనం సమయంలో సీసీ కెమెరాలను తొలగించి, ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేశారన్నారు. నిపుణులైన అధ్యాపకులకు బదులుగా కాంట్రాక్టు సిబ్బంది, ఇతరులతో పేపర్లు దిద్దించారనే విషయాలు విచారణలో బయటపడినట్లు తెలిపారు. ప్రైవేట్ వేదికలు కేంద్రంగా పేపర్ దిద్దుబాట్లు, మార్పులు చేర్పులు జరిగాయని సిట్ సమర్పించిన నివేదికలో బట్టబయలైందని స్పష్టం చేశారు. గతంలో తాడేపల్లి నుంచే ఆదేశాలు జారీ అయ్యాయని, ఏపీపీఎస్సీ చైర్మన్ అధికారాలను పక్కనబెట్టి నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. ఇలా విద్యార్థుల భవితకు వైసీపీ పాలన గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. రాష్ట్రంలో యువత భవితకు మంచి చేయాలనే ఉద్దేశంతో 16 వేల మందికిపైగా అభ్యర్థులకు డీఎస్సీ ద్వారా మంచి చేశామని తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ పేరిట యువతను దగా చేయడం అందరికీ తెలిసిన విషయమేనన్నారు.

## గుంటూరులో దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు

- 203 మంది సిబ్బందితో యాంటీ లార్వా కార్యక్రమాలు..
- డెంగ్యూ, చికున్‌గున్యా కేసులు గణనీయంగా తగ్గుముఖం



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): ప్రపంచ దోమల దినోత్సవం (ఆగస్టు 20) సందర్భంగా గుంటూరు నగరంలో దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. నాలుగు మలేరియా డివిజన్ల పరిధిలో 203 మంది సిబ్బందితో యాంటీ లార్వా కార్యకలాపాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కమిషనర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాల ప్రకారం, గత ఏడాది ఇదే సమయానికి మలేరియా 4, డెంగ్యూ 51, చికున్‌గున్యా 8 కేసులు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా ఒక్కకేసు కూడా నమోదు కాలేదు. డెంగ్యూ కేసులు 26కు, చికున్‌గున్యా కేసులు ఒక్కటికి పరిమితమయ్యాయి.

దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి నిల్వ నీటిని తొలగించడం, అవసరమైన ప్రాంతాల్లో యాంటీ లార్వల్ చర్యలు చేపట్టడం ద్వారా లార్వా దశలోనే దోమల నియంత్రణ జరుగుతోందని తెలిపారు. వ్యాధి వ్యాప్తి పరిస్థితులను బట్టి ఫాగింగ్‌తో పాటు యాంటీ అడల్ట్ చర్యలు కూడా అమలు చేస్తున్నట్లు చెప్పారు.

జీవ నియంత్రణలో భాగంగా ఇప్పటివరకు సుమారు 15 లక్షల గంబూసియా చేపలను చెరువులు, బావుల్లో విడిచినట్లు తెలిపారు. దోమల సాంద్రతను అంచనా వేసేందుకు మస్కిటో ట్రాపింగ్ యంత్రాలు, ఆధునిక సెన్సార్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 30 చెరువులు, ప్రధాన డ్రైన్లు, చేరుకోవడానికి కష్టమైన ప్రాంతాల్లో ఏఐ ఆధారిత డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

దోమల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న కమిషనర్, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వస్తువుల్లో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం లేదా దోమల ద్వారా వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎస్టి,బిసిల భూములను ఆక్రమించాలనుకోవడం సరికాదు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్
- కాలని వారికి చెందిన భూముల్లో పర్యటించిన వ్యకాస నాయకులు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నె పల్లె గ్రామం ఎస్టి కాలనీకి చెందిన 94 మందికి చెందిన భూములను ఆక్రమించాలనుకోవడం సరికాదని వెంటనే ఆలోచన విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శివకుమార్ భూ ఆక్రమణ దారులను హెచ్చరించారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం బ్రహ్మంగారిమఠం మండల కమిటీ ఆధ్వర్యంలో పలుగురాళ్లపల్లె రెవిన్యూ పొలంలోని 1938 సర్వే నెంబర్ నశీదు ఎస్టీ, బిసి లకు చెందిన భూముల్లో పర్యటించారు.

ఈ సందర్భంగ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శివకుమార్ మండల కార్యదర్శి సాన గోవిందస్వామి లింగాలదిన్నెపల్లి ఎస్టి కాలనికిచెందినవారితో కలిసి మాట్లాడుతూ 2007వ సంవత్సరం అసైన్మెంట్ కమిటీ నందు అప్పటి ప్రభుత్వం లింగాలదిన్నె పల్లె గ్రామంలోని ఏరుకుల, యానాది పిచ్చిగుంట్ల, ముత్త రాసు, బెస్త కులాలకు చెందిన 94 మంది ఎకరా చొప్పున డికెటి పట్టాలు మంజూరు చేసి భూమిని సర్వే చేసి హద్దులు చూపించారని అప్పటినుండి ఆ భూమిలో కంది, ఉలవ ఆముదాలు లాంటి పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నారని వారు తెలిపారు. గత 4,సంవత్సరాల నుండి భూమి పక్క గ్రామానికి చెందిన కొంతమంది అగ్రవర్ణాలు పేదలను భూముల్లోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని పలు మార్లు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసిన రాజకీయ పలుకుబడితో తప్పించుకుంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడైతే సోలార్ కంపెనీ ఇక్కడ మంజూరు అయిందో అప్పటినుండి పేదలను బెదిరించడం ఎక్కువైందని పేదల భూములు లాక్కుని సోలార్ కంపెనీకి అమ్ముకునే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇటువంటి భూకబ్జా ధారులకు రాజకీయ పలుకు బడి కలిగిన వారుఅండదండ లిస్తున్నారని అందువల్లనే వారు రెచ్చిపోతున్నారని వారు ఆరోపించారు.

దౌర్జన్యంగ దుర్మార్గంగ పేదలకు చెందిన భూములను ఆక్రమించాలని చూస్తే సహించబోమని చట్టపరంగా ముందుకు వెళ్తామని వారు హెచ్చరించారు.

ఈ పర్యటనలో నాయకులు మల్లికార్జున. అజయ్ కుమార్, గ్రామ ప్రజలు ఆంజనేయులు బ్రహ్మయ్య రామాంజనేయులు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## రూ.20 లంచం కేసు.. 30 ఏళ్ల తర్వాత ఇద్దరు ఉద్యోగులకు సుప్రీం ఊరట

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : కేవలం రూ. 20 లంచం ఆరోపణలతో మూడు దశాబ్దాలు పాటు సాగిన సుదీర్ఘ న్యాయపోరాటానికి సర్వోన్నత న్యాయస్థానం తెరదించింది. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను నిర్దోషులుగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ట్రయల్ కోర్టు, హైకోర్టు విధించిన శిక్షలను రద్దు చేస్తూ వారికి పూర్తి ఊరట కల్పించింది.

కేసు నేపథ్యం పరిశీలిస్తే, 1996 ఫిబ్రవరిలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా బెచారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యాపరమైన రాయితీల నిమిత్తం ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఇన్‌కమ్ సర్టిఫికెట్) కోసం ఒక విద్యార్థి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, అక్కడి క్లర్క్ రూ. 120 (తనకు రూ. 100, ప్యూన్‌కు రూ. 20) లంచం డిమాండ్ చేశాడని సదరు విద్యార్థి అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) ఫిర్యాదు చేశాడు.

బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం రంగు పూసిన నోట్లతో ఉచ్చు పన్నారు. సర్టిఫికెట్ అందుకున్న అనంతరం విద్యార్థి, ప్యూన్‌కు రూ. 20 ఇచ్చాడు. ఆ నగదును అధికారులు ప్యూన్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. అయితే, క్లర్క్ డిమాండ్ చేశాడన్న రూ. 100 మాత్రం ఎక్కడా లభించలేదు.

జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది.

కేవలం నగదు రికవరీ అయినంత మాత్రాన లంచం తీసుకున్నట్లు నిర్ధారించలేమని, లంచం 'డిమాండ్' చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉండాలని ఈ సందర్భంగా ధర్మాసనం తేల్చిచెప్పింది.

ఫిర్యాదుదారుడైన విద్యార్థి వాంగ్మూలంలో పలు వైరుధ్యాలు ఉన్నాయని కోర్టు గుర్తించింది. ప్యూన్ తనను ఎప్పుడూ డబ్బు అడగలేదని విద్యార్థి క్రాస్ ఎగ్జామినేషన్‌లో అంగీకరించిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. పని పూర్తయిన తర్వాత డబ్బు ఇవ్వడం, "మరుసటి రోజు పండుగ కావడంతో విద్యార్థి తనకు ఆ నగదు ఇచ్చాడన్న" ప్యూన్ వాదన సహేతుకంగా ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది.

అలాగే క్లర్క్‌పై కేసు నమోదుకు ఉన్నతాధికారి ఇచ్చిన అనుమతి కూడా చెల్లదని పేర్కొంది. ఈ కారణాలతో దిగువ కోర్టుల తీర్పులను కొట్టివేస్తూ, 30 ఏళ్ల సుదీర్ఘ కేసుకు ముగింపు పలికింది.

## ఎన్నికల నిర్వహణకు సిద్ధం : కలెక్టర్ సాయికాంత్ వర్మ

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయని చెప్పారు. బ్యాలెట్ పెట్టెల అవసరం కొంత మేర ఉండవచ్చని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఓటరు జాబితా సిద్ధం చేయాలని, పోలింగ్ కేంద్రాల పరిస్థితిపై దృష్టి సారించాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్ లను గుర్తించి శిక్షణ అందించాలని, కార్యక్రమాల నిర్వహణ షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఎన్నికల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, వాటి బందోబస్తు పట్ల దృష్టి సారించాలని ఆదేశించారు.





స్థానికంగా సమకూర్చుకోవలసిన ఎన్నికల సామగ్రి, రాష్ట్ర స్థాయి నుండి రావలసిన సామాగ్రి జాబితాపై స్పష్టమైన అవగాహన ఉండాలని అన్నారు. కోర్టు వ్యవహారాలలో ఉన్న స్థానిక సంస్థలపై పూర్తి నివేదిక సమర్పించాలని చెప్పారు. ఓటరు జాబితాను తాజా పరచడం విషయంలో షెడ్యూల్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, ఎం. టి. ఎం. సి కమిషనర్ అలీం భాషా, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత జడ్పీ సూపరింటెండెంట్ కాజనారాయణరావుకు సత్కారం




తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): పట్నంలోని రామలింగేశ్వరపేటలోని పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జవిఎస్ రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి కాజ నారాయణరావు ను దుశ్యాలువ తో ఘనంగా సత్కరించారు. సందర్భంగా రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగిగా ఉన్న నారాయణరావు అనేక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనటం సంతోషకరమని అన్నారు.

72 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నారాయణ రావు ను వారి వివాహ మహోత్సవ రోజున ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో తెనాలి పద్మశాలి ఉద్యోగుల సంఘ అధ్యక్షులు తిరువీధుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుఅందెబాలచంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి బిట్రా వెంకట సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి పడవల శివయ్య, ఆరికాటి బాలసుబ్రమణ్యం, కందుల శ్రీనివాసరావు, మాచర్ల శివ నాగప్రసాద్, కౌతరపు శ్రీనివాసరావు తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పంచాయతీల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపునకు షెడ్యూలు విడుదల

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ పంచాయతీలలో ఎస్సీ, ఎస్టీ మరియు బీసీ ఓటర్లను గుర్తించి, ప్రత్యేక జాబితాలను రూపొందించే ప్రక్రియకు సంబంధించి అధికారిక షెడ్యూలువిడుదలయింది. ఈ ప్రక్రియను పారదర్శకంగా మరియు సక్రమంగానిర్వహించేందుకు పంచాయతీరాజ్ శాఖ తగిన మార్గదర్శకాలను జారీ చేసింది.

**ముఖ్యమైన షెడ్యూలు వివరాలు...**

ఇంటింటి సర్వే: ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేకంగా ఇంటింటి సర్వే నిర్వహించి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లనుగుర్తిస్తారు.

**ఓటర్ల జాబితాలో మార్కింగ్**

21 నుంచి 22వ తేదీ వరకు సేకరించిన వివరాల ఆధారంగా ఓటర్ల జాబితాలో సంబంధిత వర్గాలను స్పష్టంగా మార్కింగ్ చేస్తారు.

23వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లతో కూడిన ముసాయిదా జాబితానుప్రచురిస్తారు. 24 నుంచి 26వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. 27 నుంచి 31 వరకు అభ్యంతరాలను పరిశీలించి విచారణ జరిపి తుది నిర్ణయం తీసుకుంటారు.

**గ్రామ సభల ఆమోదం**

సెప్టెంబరు 1 నుంచి 4వ తేదీ వరకు గ్రామ సభలలో ఈ జాబితాలనుసమర్పించి ధ్రువీకరిస్తారు. సెప్టెంబర్ 5న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించిన తుది ఓటర్ల జాబితానుఅధికారికంగా తయారు చేసి ప్రచురిస్తారు.

**విధివిధానాలు మరియు మార్గదర్శకాలు..**

గుర్తింపు అధికారి నియామకం: ప్రతి పంచాయతీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు నిమిత్తం ప్రత్యేకంగా ఒక గుర్తింపు అధికారిని నియమించాల్సి ఉంటుంది. సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా గ్రామ పంచాయతీ మినిస్టీరియల్ సిబ్బంది నుంచి జిల్లా పంచాయతీ అధికారి నియమిస్తారు.

ఓటర్ల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల పేర్లను ఎరుపు బాల్ పాయింట్ పెన్‌తో స్పష్టంగా మార్కింగ్ చేయాలి. ఇతర ప్రభుత్వ శాఖలు లేదా సంస్థలు అందించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ జాబితాలతో వీటిని సరిపోల్చి (క్రాస్ చెక్) పరిశీలించాలి.

**ముసాయిదా మరియు క్లెయిమ్స్ వివరాలు**

గుర్తింపు చేసిన అసలు జాబితాను మాస్టర్ కాపీగా ఉంచి, దాని ఆధారంగా మరో కాపీని తయారు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లతో కూడిన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను ప్రచురించాలి. ఎవరికైనా ఓటరుగా పేరు చేర్చాలని కోరే వారు లేదా అభ్యంతరాలు తెలపడానికి తగిన ఫారాలను ఉపయోగించవచ్చు:

ఫారం-2: ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటరుగా కొత్తగా పేరు చేర్చాలని కోరేవారు దరఖాస్తు చేసుకోవడానికి.

ఫారం-3: ఒకరి పేరు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటరుగా చేర్చడంపై ఇతరుల నుంచి అభ్యంతరం ఉంటే తెలపడానికి.

ఫారం-4: ఎవరి పేరు అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటరుగా చేర్చడంపై స్వయంగా అభ్యంతరం ఉంటే ఉపయోగించడానికి.

ఈ ప్రక్రియ మరియు ఓటరు జాబితాలకు సంబంధించిన మరింత అధికారిక సమాచారం కోసం సంబంధిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం లేదా పంచాయతీరాజ్ శాఖ వారి అధికారిక పోర్టల్స్‌ను సందర్శించవచ్చు.

## ఇంటర్ బోర్డులో విజిలెన్స్ సోదాలు.. మళ్లీ తెరపైకి 2019 ఫలితాల వివాదం

హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం మరోసారి వార్తల్లో నిలిచింది. నాంపల్లిలోని బోర్డు కార్యాలయంలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

గంటల పాటు ఈ సోదాలు నిర్వహించడంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. 2019 నాటి ఇంటర్ ఫలితాల వివాదానికి సంబంధించి ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం.

అప్పట్లో ఫలితాల వెల్లడి బాధ్యతలను నిర్వహించిన గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థ అక్రమాలకు పాల్పడిందన్న ఆరోపణలు పెను దుమారం రేపాయి. మార్కుల కేటాయింపులో జరిగిన పొరపాట్ల కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

తాజాగా ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ విభాగం విచారణ ప్రారంభించింది.

ఇందులో భాగంగానే అధికారులు ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి అశోక్‌ను విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ సోదాలకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సముద్రంలో గల్లంతైన కోనసీమ మత్స్యకారుల గాలింపు చర్యలపై సీఎం ఆరా



○ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులతో మాట్లాడిన సీఎం చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సముద్రంలో గల్లంతైన బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మత్స్యకారుల ఆచూకీని కనుగొనేందుకు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనలో జరుగుతున్న గాలింపు చర్యలపై సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులతో వర్చువల్ గా మాట్లాడారు. గాలింపు చర్యలు ఏ మేరకు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్స్, మెరైన్ పోలీసులు గాలిస్తున్నారని... జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు గాలింపు చర్యలను పర్యవేక్షిస్తోందని అధికారులు సీఎంకు తెలిపారు. ఇప్పటికే రెండు డార్నియర్ విమానాలు.. నేవీ బోట్లతో పాటు మరో ఏడు బోట్లతో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల బోట్లను కూడా అప్రమత్తం చేసి గల్లంతైన బోటు ఆచూకీపై సమాచారం సేకరిస్తున్నామన్నారు. అయితే పారాదీప్ కు 14 నాటికల్ మైళ్ల దూరంలో కొన్ని పడవలను గుర్తించామని... వాటి గురించి ఆరా తీస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. గాలింపు చర్యలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆ ఏడు కుటుంబాలకు తెలియచేస్తూ ఉండాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## స్థానిక సంస్థల్లో 34% బీసీ రిజర్వేషన్లపై హర్షం

○ మంత్రిమండలి తీర్మానాన్ని స్వాగతించిన ఏపీ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) వారికి 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు.

2024 ఎన్నికల హామీ మేరకు పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనల ప్రకారం గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్న మంత్రిమండలి తీర్మానం సామాజిక న్యాయానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం సీలింగ్ నేపథ్యంలోనూ చట్టబద్ధంగా ఈ రిజర్వేషన్లు అమలు చేయడం అభినందనీయమన్నారు.

గత ప్రభుత్వం కేవలం 24 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేయడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 వేల స్థానిక రాజకీయ పదవులను బీసీలు కోల్పోయారని శ్రీనివాసరావు గుర్తు చేశారు.

ఈసారి చట్టం ప్రకారం 34 శాతం రిజర్వేషన్లు అమలైతే వెనుకబడిన తరగతులకు రాజకీయ ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

బాగా వెనుకబడిన తరగతులైన ఎంబీసీలకు కూడా సముచిత న్యాయం జరిగేలా స్థానిక సంస్థల రిజర్వేషన్లను విద్య, ఉద్యోగ రంగాల మాదిరిగా ఏ, బి, సి, డి గ్రూపులుగా వర్గీకరించి అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

అలాగే నగర, పట్టణ, నగర పంచాయతీలలో మేయర్, చైర్మన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నిక విధానాన్ని ప్రవేశపెట్టాలన్న మంత్రిమండలి నిర్ణయం ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 13 జిల్లా పరిషత్తుల స్థానంలో 28 జిల్లా పరిషత్తులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని కూడా ఆయన స్వాగతించారు.

ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకుని బీసీలకు 34 శాతం స్థానిక రిజర్వేషన్లు అమలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలి: రవి నాయుడు



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 24, 25, 26 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించనున్న రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఏఏపీ చైర్మన్ రవి నాయుడు పిలుపునిచ్చారు.

విజయవాడలోని ఎస్ఏఏపీ కార్యాలయంలో బుధవారం ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో ప్లీనరీలో పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండంనాటి ప్రశాంత్ మాట్లాడుతూ, "చదువు–పోరాడు–సాధించు" అనే నినాదంతో ఏర్పాటైన ఆర్ఎస్‌యూ విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం వంటి అంశాలపై ప్లీనరీలో విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.

రాజమండ్రిలోని గోదావరి లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ ప్లీనరీ సమావేశాలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆర్ఎస్‌యూ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరవుతారని వెల్లడించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టే ఉద్యమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ చౌదరి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయుడు, కడప జిల్లా ఉపాధ్యక్షుడు జస్వంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సు యుగంలో కెరీర్‌పై ఎన్ఆర్ఐఐటీలో అవగాహన సదస్సు

**మేడికొండూరు, (జర్నలిస్ట్ ఫైల్):** మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంటీఎక్స్ గ్రూప్ సంస్థ సహకారంతో "కృత్రిమ మేధస్సు యుగంలో భవిష్యత్ కెరీర్‌ను నిర్మించుకోవడం" అనే అంశంపై బుధవారం కెరీర్ అవగాహన సదస్సు నిర్వహించారు.



సదస్సులో ఎంటీఎక్స్ గ్రూప్‌కు చెందిన ప్రవీణ్ కటేపల్లి, అజయ్ గౌతమ్, గజుల, హర్షిత్ జైన్, హర్ష్ సుల్తానియా, సాహిల్ బాత్రా తదితర నిపుణులు పాల్గొని విద్యార్థులకు ఏఐ ఆధారిత ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు, ప్రాజెక్టుల రూపకల్పన, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యం, కృత్రిమ మేధస్సు సమర్థ వినియోగంపై అవగాహన కల్పించారు.

భవిష్యత్ ఉద్యోగ విపణిలో నిలదొక్కుకోవాలంటే విద్యార్థులు ప్రాథమిక అంశాలపై పట్టు, నిర్ణయాత్మక ఆలోచన, ఆచరణాత్మక నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచించారు. అన్వేషణ––నిర్మాణం––ప్రత్యేక నైపుణ్యం–ప్రతిభ ప్రదర్శన అనే నాలుగు దశల విధానంలో తమ కెరీర్‌ను తీర్చిదిద్దుకోవాలని వివరించారు. అలాగే రాబోయే క్యాంపస్ నియామకాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు విలువైన సమాచారం అందించారు.

అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు ఏఐ ప్రభావం, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ భవిష్యత్తు, పరిశ్రమ అవసరాలు, ఉపాధి అవకాశాలపై తమ సందేహాలను నిపుణులతో నేరుగా చర్చించి నివృత్తి చేసుకున్నారు.

కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శరత్ కుర్రా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్, ప్రిన్సిపాల్ డా. దోలా సంజయ్ ఎస్., అడ్మిన్ మేనేజర్ బి. సీతారామయ్య తదితరులు హాజరయ్యారు. క్వాంటం విభాగ ప్రొఫెసర్ లాల్ జాన్ బాషా అధ్యక్షత వహించారు.

వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు సిద్ధం చేయడంలో ఇటువంటి అవగాహన సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## వేమూరులో రూ.6.99 లక్షల సీఎం సహాయనిధి వైద్య సాయం

**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్––ఎల్‌వోసీ) ద్వారా వేమూరు నియోజకవర్గానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 6,99,893 విలువైన వైద్య సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) పత్రాలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.



వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను ఎమ్మెల్యే ప్రత్యేక సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపగా, వాటిని పరిశీలించిన ప్రభుత్వం ఎల్‌వోసీ రూపంలో ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది.

మంజూరైన సహాయంలో భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన కందుల సుజాతకు రూ. 2,51,146, వెల్లటూరు గ్రామానికి చెందిన బొమ్మిడి వెంకట కుమారికి రూ. 1,00,551, పెదలంక గ్రామానికి చెందిన కలం రత్నబాబుకు రూ. 1,06,542 మంజూరయ్యాయి. అలాగే కొల్లూరు మండలం చిలుమూరు గ్రామానికి చెందిన కోట కుమారికి రూ. 59,492, పోతర్లంక గ్రామానికి చెందిన రాఘుల శేషుబాబుకు రూ. 1,32,670, వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన పాపబత్తిని రమాదేవికి రూ. 49,492 వైద్య సహాయం అందింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అత్యవసర వైద్య చికిత్స అవసరమైన అర్హులందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని, ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అలాగే తమకు సహాయం మంజూరయ్యేలా చొరవ తీసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులకు తక్షణమే పీఆర్సీ అమలు చేయాలి

○ ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

○ రాష్ట్ర ట్రెజరీ అధికారుల జాప్యంతో ఆర్థిక, మానసిక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగులకు 100 శాతం గ్రాస్‌పై పీఆర్సీ ను తక్షణమే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ పిఎం సేవా ప్రతినిధులు విజయవాడ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం, ఆర్థిక శాఖ పూర్తిస్థాయి పరిశీలన అనంతరం అనుమతులు మంజూరు చేసి, బడ్జెట్ కేటాయింపులు చేసినప్పటికీ రాష్ట్ర ట్రెజరీ అధికారుల జాప్యం కారణంగా నేటికీ పలువురు ఉద్యోగులకు పీఆర్సీ ప్రయోజనం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేసేందుకు ఫైనాన్స్ శాఖ సమ్మతితో జీవో నెం .167, తేదీ 14.09.2023న ప్రభుత్వం తొలిసారిగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అయితే ఆ ఉత్తర్వులు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో అర్హులైన ఉద్యోగుల జాబితాలను సమగ్రంగా పరిశీలించి, ఫైనాన్స్ క్లియరెన్స్‌తో పాటు స్పష్టమైన బడ్జెట్ కేటాయింపులు చేస్తూ ప్రభుత్వం జీవోనెం. 14, తేదీ 30.01.2026 న మరోసారి ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు, ఆర్థిక శాఖ నుంచి బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ స్థాయిలో, సంబంధిత పోర్టల్‌లో సాంకేతిక కారణాలను చూపుతూ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగుల పూర్తి వివరాలను పరిశీలించిన అనంతరమే ఆర్థిక శాఖ బడ్జెట్ విడుదల చేసిందని, ఈ విషయాన్ని ట్రెజరీ అధికారులు గుర్తించాలని కోరారు. అర్హత ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం మంజూరు చేసిన ప్రయోజనాలను సాంకేతిక కారణాలతో నిలిపివేయడం సరికాదన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన సమస్యను దృష్టిలో ఉంచుకుని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ స్థాయి నుంచి ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి, జీవో నెం .14ను తక్షణమే అమలు చేయాలని, నిలిచిపోయిన వేతనాలు, పీఆర్సీ బకాయిలను వెంటనే ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలిపిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్. కరుణాకర్ రెడ్డి, ఎం. నాగేశ్వరరావు, ఆర్. మహేంద్ర, కె. రవికుమార్, ఏ. వేణుగోపాలరావు, జి. రవీందర్ రెడ్డి, ఆర్. నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## తిరుపతి కలెక్టర్‌పై భూమన వ్యాఖ్యలను ఖండించిన ఏపీ జేఏసీ అమరావతి

○ అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతి జిల్లా కలెక్టర్‌పై మాజీ ఎమ్మెల్యే, సీనియర్ రాజకీయ నాయకుడు భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన అనుచిత, అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలను ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు తీవ్రంగా ఖండించారు.

బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, ఒక జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారిపై వ్యక్తిగతంగా అసభ్య పదజాలంతో మాట్లాడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కలెక్టర్ చర్యలపై అభ్యంతరాలు ఉంటే ప్రభుత్వం లేదా సంబంధిత న్యాయస్థానాలను ఆధారాలతో ఆశ్రయించాల్సిందే తప్ప, మీడియా వేదికగా వ్యక్తిగత విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు.

రాష్ట్ర లేదా జిల్లా యంత్రాంగం తీసుకున్న నిర్ణయాలపై విభేదాలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో ప్రశ్నించే అవకాశం అందరికీ ఉందని, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడి నుంచి ఇటువంటి వ్యాఖ్యలు ఆశించలేదని వారు వ్యాఖ్యానించారు.

ప్రజా జీవితంలో ఉన్నవారు అధికారులపై విమర్శలు చేసే సమయంలో హుందాతనం, సంయమనం పాటించాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు హితవు పలికారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను భూమన కరుణాకర్‌రెడ్డి తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రకటనకు అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్ మద్దతు తెలిపారు.

## కళ్లకు గంతలతో జూనియర్ డాక్టర్ల నిరసన

○ గుంటూరులో 10వ రోజు కొనసాగిన రాష్ట్రవ్యాప్త సమ్మె

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్టైపెండ్ పెంపు సహా పలు న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ జూనితర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె బుధవారం 10వ రోజుకు, మూడో దశ మూడో రోజుకు చేరుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల్లో జూనియర్ వైద్యులు ఆందోళన కొనసాగించారు.





గుంటూరు మెడికల్ కాలేజీకి చెందిన జూనియర్ వైద్యులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు 15 మంది పీజీ వైద్యులు స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

నిరసనలో భాగంగా జూనియర్ వైద్యులు కళ్లకు గంతలు కట్టుకుని వినూత్నంగా ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పెరుగుతున్న జీవన వ్యయం, ఆర్థిక భారాన్ని ప్రతిబింబించేలా కూరగాయలు విక్రయిస్తూ నిరసన తెలిపారు. మధ్యాహ్నం ఫేస్ పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించి తమ డిమాండ్లను సృజనాత్మకంగా ప్రజలకు తెలియజేశారు.

మూడో దశలో అత్యవసర వైద్య సేవల నుంచి జూనియర్ వైద్యులు తప్పుకోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రాక తగ్గినట్లు జూడా నాయకులు తెలిపారు.

దీంతో కొందరు రోగులు ప్రత్యామ్నాయ వైద్య సేవలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, సమ్మె కొనసాగుతున్నప్పటికీ సమాజం పట్ల తమ సేవా బాధ్యతలో భాగంగా గురువారం జూనియర్ వైద్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జూడా ప్రకటించింది. ప్రభుత్వంతో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, సామరస్యపూర్వక పరిష్కారం ద్వారా త్వరలోనే సాధారణ వైద్య సేవలు పునరుద్ధరించాలని ఆశిస్తున్నట్లు జూడా ప్రతినిధులు తెలిపారు.

## ఆలపాటి చొరవతో సీఎం సహాయనిధి నుంచి రూ.2.07 లక్షల ఆర్థిక సాయం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన మొత్తం రూ. 2,07,069 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

కందలం ప్రసన్న, చామర్తి క్రాంతి కిరణ్‌లకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 1,36,560, కేతావత్ దేశ్యా నాయక్‌కు రూ. 70,509 చొప్పున ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు చెక్కులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ లబ్ధిదారులకు అందించారు.

ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దూస్, పసుపులేటి త్రిమూర్తి, వసంతం అశోక వర్ధన తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కి కృష్ణా జలాలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది సీఎం చంద్రబాబు నాయుడేనని, ప్రారంభోత్సవం చేస్తోంది చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో వెలిగొండ నిర్వాసితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 200 కోట్ల పరిహారం చెక్కును అందజేశారు.

అనంతరం మీడియా సమావేశంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నిజం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నదని చెప్పారు. అందులో భాగంగా తొలి విడత రూ. 318 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.

నేడు రెండో విడతగా మరో రూ. 200 కోట్లు అందజేశామన్నారు. మిగిలిన రూ. 400 కోట్లు నిర్వాసితులకు త్వరలోనే చెల్లించి ఈ నెలలోనే నల్లమల్ల సాగర్ కు నీరిస్తామన్నారు.

వెలుగొండ నిర్వాసితులను వైసిపి పార్టీ దారుణంగా మోసగించిందని, పూర్తికాని ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన ఘనత ఆ పార్టీ నాయకుడికే చెల్లిందన్నారు. చెప్పినట్లే మార్కాపురం జిల్లా చేశామని, వెలుగొండకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి ప్రారంభిస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## ఇంటింటికీ టీడీపీ.. 70 లక్షల ఇళ్లకు చేరువగా కార్యక్రమం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం – రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరితంగా సాగుతోంది. ఈ కార్యక్రమం ప్రారంభమైన 24 రోజుల్లో పార్టీ శ్రేణులు మొత్తం 69.26 లక్షల కుటుంబాలను నేరుగా కలిశారు. బుధవారం 24వ రోజున తాజాగా మరో 2.54 లక్షల ఇళ్లను సందర్శించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో వారి అభిప్రాయాలను సేకరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంటింటి పర్యటనలో భాగంగా ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరిస్తూనే, వారు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై ఆరా తీస్తున్నారు.

ప్రజల నుంచి వస్తున్న సూచనలు, సలహాలను పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ, వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, వారి అవసరాలను గుర్తించే పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.

ఇప్పటికే 60 లక్షల గృహాల సందర్శన మైలురాయిని దాటిన ఈ కార్యక్రమం, ప్రస్తుతం 70 లక్షల మార్కుకు చేరువ కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ, ప్రజలతో నిరంతర సంబంధాలను కొనసాగించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467